

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684



## విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | మంగళవారం | 21.07.2026 | సంపుటి: 3 | సంచిక: 169 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | TUESDAY | 21.07.2026 | VOLUME : 3 | ISSUE : 169 | PAGES: 8 | COST: 2/- |




## వారం రోజుల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డులకు శ్రీకారం
- రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి పంపిణీకి ఏర్పాట్లు
- సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
- ఈ-కేవైసీ పూర్తి చేయాలని అధికారుల సూచన

## వాస్తవాలతోనే చర్చలు జరగాలి: ప్రధాని మోడీ

- వర్షాకాల పార్లమెంట్ సమావేశాలకు ముందు ప్రధాని సందేశం
- దేశ ప్రయోజనాలే చర్చలకు కేంద్రబిందువుగా ఉండాలని సూచన
- అభివృద్ధి, సాంకేతిక పురోగతిని ప్రస్తావించిన ప్రధాని
- కీలక బిల్లులపై చర్చలకు ప్రభుత్వం సిద్ధం

2





## డీలిమిటేషన్‌కు కొత్త ఫార్ములా..
# దక్షిణాది వైఖరిలో మార్పు

- 50 శాతం సీట్ల పెంపుపై రాజకీయ వర్గాల్లో చర్చ
- దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గదనే అంచనా
- ప్రాంతీయ పార్టీల్లో సానుకూల సంకేతాలు
- డీలిమిటేషన్‌పై కొత్త సమీకరణాలకు తెర

**న్యూఢిల్లీ, జూలై 20:**
దేశ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారనున్న నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కొత్త చర్చ మొదలైంది. జనాభా ప్రాతిపదికన మాత్రమే లోక్‌సభ స్థానాల పునర్విభజన జరిగితే ఉత్తరాది రాష్ట్రాల ప్రాతినిధ్యం భారీగా పెరిగి, జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గిపోతుందనే ఆందోళనలు చాలా కాలంగా వ్యక్తమవుతున్నాయి. అయితే ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చకు వచ్చిన యూనిఫాం 50 శాతం సీట్ల పెంపు ప్రతిపాదన ఈ సమీకరణాలను పూర్తిగా మార్చే అవకాశముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విధానంలో ఏ రాష్ట్రానికీ ప్రస్తుతం ఉన్న సీట్లు తగ్గకుండా, ఉన్న స్థానాలకు అదనంగా 50 శాతం పెంపు ఉంటుందనే ప్రచారం జరుగుతోంది.

**డీఎంకే వైఖరిలో మార్పు?**
ఈ ప్రతిపాదనపై తమిళనాడులోని

మిగతా 3వ పేజీలో..

## సుప్రీంకోర్టులో మరో నాలుగు జడ్జీల పోస్టులు

- జడ్జీల సంఖ్య పెంపునకు సవరణ బిల్లు లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్రం
- ప్రధాన న్యాయమూర్తితో కలిపి మొత్తం బలం 38కు పెంపు
- పెండింగ్ కేసుల భారం తగ్గించడమే లక్ష్యమని కేంద్రం వెల్లడి



3

## కరువును ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలం: కేటీఆర్



- సాగునీటి నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- గోదావరి నీటిని ఎత్తిపోసే చర్యల్లో నిర్లక్ష్యమని ఆరోపణ
- వెంటనే పంపులు ప్రారంభించి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్
- రిజర్వాయర్లలో నీటి నిల్వలపై ఆందోళన వ్యక్తం

2

## తెలంగాణ యువ పారిశ్రామికవేత్త విజయాలు గర్వకారణం

- జోధ్యా వ్యవస్థాపకుడు రోహిత్‌తో భేటీ
- అంతర్జాతీయ స్థాయిలో సంస్థ పురోగతిపై అభినందనలు
- టీ-హబ్ ద్వారా ప్రపంచ స్థాయి సంస్థగా ఎదిగిందని వ్యాఖ్య

2




## హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం

- నగరంలోని పేద కుటుంబాలకు తొలి విడతలో లక్ష ఇళ్ల మంజూరు
- ప్రతి నియోజకవర్గానికి తొలి దశలో 500 ఇళ్ల కేటాయింపు
- మహిళల పేరిటే ఇంటి పట్టాలు జారీ
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపడతామని మంత్రుల వెల్లడి

3



## ఉద్యోగుల కుటుంబాలకు అండగా 'చేయూత': పొన్నం ప్రభాకర్

- డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి రూ.90.85 లక్షల చెక్కు
- ఉద్యోగుల పరస్పర సహకారానికి చేయూత కార్యక్రమం నిదర్శనం
- సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యం

2



3

## త్రిపుర డీజీపీ అనుమానాస్పద మృతి!

## ట్రైనీ ఐపీఎస్ వ్యవహారంలో కొత్త మలుపు

- ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం
- రిలేషన్‌షిప్‌లో ఉన్నామని లేఖలో పేర్కొన్న ట్రైనీ ఐపీఎస్
- మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదుతో ఇప్పటికే కేసు నమోదు

2



## ఆయిల్ పామ్‌తో రైతుకు స్థిరమైన ఆదాయం

- వర్షాభావ పరిస్థితుల్లో రైతుకు ఖచ్చితమైన ఆదాయం
- మన కొణిజర్ల నుంచే ఆయిల్ పామ్ సీడ్స్
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- గోద్రెజ్ అగ్రివేట్ ఆయిల్ పామ్ కాంప్లెక్స్ ప్రారంభం

**ఖమ్మం, జూలై 20 :**
ఖమ్మం జిల్లా కేవలం వ్యవసాయానికే పరిమితమైన తరుణంలో ఇక్కడి రైతాంగానికి అధిక దిగుబడి, మెరుగైన రాబడి అందించేందుకు ఆయిల్ పామ్ సాగు ఒక అద్భుతమైన వరమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామంలో దాదాపు

మిగతా 3వ పేజీలో..



## పోలీసు కుటుంబాల సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యం

- సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష
- విద్య, వైద్యం, రుణ సదుపాయాల విస్తరణకు ఆదేశాలు
- ఆరోగ్య భద్రత పథకం ద్వారా వేలాది మందికి వైద్య సేవలు
- సంక్షేమ నిధుల వినియోగంలో పారదర్శకతకు ప్రాధాన్యం

2

## నీట్ నిరసనలపై పోలీసు చర్య ఖండనీయం: రేవంత్ రెడ్డి

- ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండించిన సీఎం
- నీట్ వ్యవహారంపై కేంద్రం జవాబుదారీతనం వహించాలని డిమాండ్
- 'ఛలో పార్లమెంట్' కార్యక్రమంలో ఉద్రిక్తత



2



## ఎక్కడ ఉన్నా మన మూలాలను మరువొద్దు

- టీటీఏ మెగా కన్వెన్షన్‌లో పంచాయతీరాజ్ మంత్రి సీతక్క

2

# కరువును ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలం: కేటీఆర్

**హైదరాబాద్, జూలై 20:**

కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతులకు సాగునీరు అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణలో నెలకొన్న కరువు పరిస్థితులు, సాగునీటి నిర్వహణ అంశాలపై ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన పంప్ హౌస్‌లను ప్రభుత్వం సక్రమంగా వినియోగించడం లేదని ఆరోపించారు. కరువు పరిస్థితులు ఏర్పడినప్పుడు రైతులకు సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం పంపులను ప్రారంభించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. గోదావరి నదిలో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ దానిని ఎత్తిపోసే చర్యలు చేపట్టకుండా కాలయాపన చేస్తోందని అన్నారు.

రైతులు పంటలు పండిస్తే ప్రభుత్వంపై సంక్షేమ పథకాల భారం పెరుగుతుందనే ఉద్దేశంతోనే సాగునీటి సరఫరాను నిర్లక్ష్యం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే పంపులను ప్రారంభించి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని కేటీఆర్ విమర్శించారు. రెండేళ్ల పాలనలో అభివృద్ధి కంటే రాజకీయ విమర్శలకే ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చిందని ఆరోపించారు. సాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రావాలని సూచించారు.

రాష్ట్రంలో నీటి లభ్యతపై ప్రభుత్వం చెబుతున్న విషయాలు వాస్తవ పరిస్థితులకు భిన్నంగా ఉన్నాయని కేటీఆర్ అన్నారు. దిగువ ప్రాంతాలకు నీటి సరఫరా కొనసాగుతున్నప్పుడు తెలంగాణలో నీటి కొరత ఎందుకు ఏర్పడిందో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గిపోతున్నప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రిజర్వాయర్లు డెడ్ స్టోరేజీ స్థాయికి చేరుకున్నా ప్రభుత్వం స్పందించడం లేదని కేటీఆర్ ఆరోపించారు. కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు తక్షణ చర్యలు చేపట్టడంతో పాటు రైతులకు సాగునీరు అందించేలా ప్రభుత్వం వ్యవహరించాలని కోరారు.




# ఉద్యోగుల కుటుంబాలకు అండగా 'చేయూత ': పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జూలై 20:**

ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా అండగా నిలవడమే చేయూత కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని* రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల పరస్పర సహకారంతో అమలవుతున్న ఈ కార్యక్రమం ఉద్యోగుల ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన దివంగత డ్రైవర్ కోలా శంకర్ కుటుంబ సభ్యులకు చేయూత కార్యక్రమం కింద రూ.90,85,500 విలువైన చెక్కును మంత్రి అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆర్టీసీ కుటుంబంలో భాగమైన ప్రతి ఉద్యోగి సంక్షేమానికి సంస్థ కట్టుబడి ఉందన్నారు. ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. మృత ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంలో చేయూత కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.

దివంగత కోలా శంకర్ అందించిన సేవలను మంత్రి స్మరించుకున్నారు. ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు ఉద్యోగుల కుటుంబాలకు ధైర్యాన్ని, భరోసాను అందిస్తాయని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.సి. సజ్జనార్, కార్యనిర్వాహక సంచాలకులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దివంగత ఉద్యోగి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం కోసం చేపడుతున్న పథకాలను మరింత బలోపేతం చేస్తామని, అవసరమైన సమయంలో ప్రతి ఉద్యోగి కుటుంబానికి చేయూత కార్యక్రమం ద్వారా అండగా నిలుస్తామని అధికారులు తెలిపారు.

# నీట్ నిరసనలపై పోలీసు చర్య ఖండనీయం: రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, జూలై 20:**

నీట్ యూజీ 2026 పరీక్ష నిర్వహణలో చోటు చేసుకున్న అవకతవకలను నిరసిస్తూ ఢిల్లీలో ఆందోళన చేపట్టిన విద్యార్థులపై పోలీసుల చర్యను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయడం, బాష్పవాయువు ప్రయోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఈ విషయంలో విద్యార్థులకు తన పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

**కేంద్రంపై విమర్శలు**

సామాజిక మాధ్యమాల ద్వారా స్పందించిన రేవంత్ రెడ్డి, విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు వారి గొంతు నొక్కేందుకు పోలీసు బలగాలను ఉపయోగిస్తోందని ఆరోపించారు. నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పడిన ప్రతి దెబ్బ ప్రశ్నలకు, నిజాలకు బీజేపీ భయపడుతోందనే విషయాన్ని బయటపెడుతోందని వ్యాఖ్యానించారు. నీట్ కుంభకోణంపై కేంద్ర ప్రభుత్వం జవాబుదారీతనం వహించాలని డిమాండ్ చేశారు.

**'ఛలో పార్లమెంట్'లో ఉద్రిక్తత**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలి రోజున విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో 'ఛలో పార్లమెంట్ ' కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలో సమగ్ర సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు.

**పోలీసుల చర్య**

ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో పాటు బాష్పవాయువు ప్రయోగించారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులు గాయపడినట్లు సమాచారం. ఈ సంఘటనపై రాజకీయ నాయకులు, వివిధ విద్యార్థి సంఘాలు స్పందిస్తూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నాయి.

# తెలంగాణ యువ పారిశ్రామికవేత్త విజయాలు గర్వకారణం: కేటీఆర్

- జోధ్యా వ్యవస్థాపకుడు రోహిత్‌తో భేటీ
- అంతర్జాతీయ స్థాయిలో సంస్థ పురోగతిపై అభినందనలు
- టీ-హబ్ ద్వారా ప్రపంచ స్థాయి సంస్థగా ఎదిగిందని వ్యాఖ్య
- యువ ఆవిష్కర్తలకు తెలంగాణ అనుకూల వేదికగా మారిందని వెల్లడి



**హైదరాబాద్, జూలై 20:**

తెలంగాణలో రూపుదిద్దుకున్న యువ పారిశ్రామిక సంస్థలు ప్రపంచ స్థాయిలో విజయాలు సాధించడం రాష్ట్రానికి గర్వకారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఐఐటీ మద్రాస్ పూర్వ విద్యార్థులతో కలిసి జోధ్యా సంస్థను స్థాపించిన యువ పారిశ్రామికవేత్త రోహిత్‌తో సోమవారం భేటీ అయిన ఆయన, సంస్థ సాధిస్తున్న ప్రగతిని అభినందించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, వాణిజ్య భవనాలు, పరిశ్రమల్లో విద్యుత్ వినియోగాన్ని 10 నుంచి 30 శాతం వరకు తగ్గించే మేధో ఆధారిత శక్తి నిర్వహణ పరిష్కారాలను జోధ్యా అభివృద్ధి చేస్తోందని తెలిపారు. ఈ సాంకేతికతతో విద్యుత్ వినియోగ సామర్థ్యం పెరగడంతో పాటు కాలుష్య ఉద్గారాలను కూడా తగ్గించే అవకాశం ఉందన్నారు.

భారత్‌లో అభివృద్ధి చేసిన సాంకేతికతను అమెరికా, ఆగ్నేయాసియా దేశాల మార్కెట్లకు తీసుకెళ్లి జోధ్యా గుర్తింపు పొందడం తెలంగాణ ప్రతిష్ఠను మరింత పెంచిందని కేటీఆర్ పేర్కొన్నారు. దేశీయ ఆవిష్కరణలు ప్రపంచ స్థాయిలో పోటీ పడుతుండటం సంతోషకర పరిణామమని అన్నారు.


టీహబ్‌లోనే ఈ లోతైన సాంకేతిక పరిజ్ఞాన సంస్థ రూపుదిద్దుకోవడం మరింత ప్రత్యేకతను సంతరించుకుందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణలో ప్రభుత్వం కల్పించిన ఆవిష్కరణల వాతావరణం యువ పారిశ్రామికవేత్తలకు ప్రపంచ స్థాయి అవకాశాలను అందిస్తోందని చెప్పారు.

2023లో నిర్వహించిన హైసియా వార్షిక పురస్కారాల కార్యక్రమంలో జోధ్యా సంస్థకు అవార్డు అందించిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. అప్పటి నుంచి సంస్థ సాధించిన ప్రగతి ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా జోధ్యా మరిన్ని విజయాలు సాధించి, రోహిత్‌తో పాటు సంస్థ బృందం అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.

# వాస్తవాలతోనే చర్చలు జరగాలి: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జూలై 20:**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభానికి ముందు ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలకు, రాజకీయ పార్టీలకు కీలక సందేశం ఇచ్చారు. ఈ సమావేశాలు దేశానికి అత్యంత ఫలవంతంగా సాగాలని ఆకాంక్షిస్తూ, పార్లమెంట్‌లో చర్చలు తర్కం, వాస్తవాల ఆధారంగా జరగాలని సూచించారు. వాదనలు, వాస్తవాలు ఉన్నచోట అనవసర రాద్ధాంతానికి తావులేదని, వాస్తవాలు బలంగా ఉంటే గొంతు పెంచాల్సిన అవసరం ఉండదని వ్యాఖ్యానించారు.



**దేశాభివృద్ధిపై ప్రధాని ప్రస్తావన**

పార్లమెంట్ సమావేశాలకు ముందు మీడియాతో మాట్లాడిన ప్రధాని, రుతుపవనాలు రైతులకు ఎంత ముఖ్యమో వర్షాకాల సమావేశాలు కూడా దేశానికి అంతే ప్రయోజనకరంగా ఉండాలని ఆకాంక్షించారు. గత నెలలో అంతరిక్షం, సాంకేతికత, పరిశ్రమల రంగాల్లో భారత్ సాధించిన విజయాలను గుర్తు చేస్తూ, భారత యువత సామర్థ్యం ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోందని అన్నారు. ఒక భారతీయ యువత నేతృత్వంలోని స్టార్టప్ అంతరిక్ష రంగంలో కీలక విజయాన్ని నమోదు చేయడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు.

**అభివృద్ధి ప్రాజెక్టులపై వివరాలు**

రాజస్థాన్‌లో భారీ చమురు శుద్ధి కర్మాగారాన్ని దేశానికి అంకితం చేసినట్లు ప్రధాని గుర్తు చేశారు. అలాగే దేశంలోని మూడో సెమీకండక్టర్ ప్లాంట్ ప్రారంభం, గ్రీన్ హైడ్రోజన్‌తో నడిచే రైలు సేవల ఆరంభం వంటి ప్రాజెక్టులు భారత సాంకేతిక సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. గ్రీన్ హైడ్రోజన్ రైలు సాంకేతికతను అమలు చేస్తున్న కొద్ది దేశాల్లో భారత్ కూడా చేరడం గర్వకారణమని అన్నారు.

**పార్లమెంట్‌లో కీలక బిల్లులు**

ఈ వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. ఆదాయపు పన్ను సవరణ బిల్లు2026, సుప్రీం కోర్టు సవరణ బిల్లు2026, జాతీయ గౌరవానికి అవమానాల నివారణ సవరణ బిల్లు2026, జననమరణాల నమోదు సవరణ బిల్లు2026, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సవరణ బిల్లు2026, విదేశీ విరాళాల సవరణ బిల్లు2026, డెవలప్ ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ బిల్లు2025 వంటి ప్రతిపాదనలను సభ ముందుకు తీసుకురానుంది. పరిపాలనా సంస్కరణలు, న్యాయవ్యవస్థ బలోపేతం, విద్యారంగ అభివృద్ధి, చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం వంటి అంశాలపై ఈ బిల్లులు దృష్టి సారించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

**19 సమావేశాల్లో కీలక చర్చలు**

కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపిన వివరాల ప్రకారం, జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు 25 రోజులపాటు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుగనున్నాయి. ఈ వ్యవధిలో మొత్తం 19 సమావేశాలు నిర్వహించనున్నారు. జాతీయ ప్రాధాన్యం కలిగిన అంశాలపై చర్చలు, కీలక నిర్ణయాలు ఈ సమావేశాల్లో జరిగే అవకాశం ఉందని ప్రభుత్వం పేర్కొంది. ప్రజా సమస్యలపై ప్రభుత్వం, ప్రతిపక్షాలు నిర్మాణాత్మకంగా చర్చించి ప్రజాస్వామ్య విలువలను మరింత బలోపేతం చేయాలని ప్రధాని నరేంద్ర మోడీ ఆకాంక్షించారు.

# ఎక్కడ ఉన్నా మన మూలాలను మరువొద్దు

**హైదరాబాద్, జూలై 20 :**

ప్రపంచంలో తెలంగాణ వారు ఎక్కడ ఉన్నా తమ ప్రాంత మూలాలను, తెలుగు భాషను, సంస్కృతిని గర్వంగా నిలబెట్టుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. అమెరికాలో నిర్వహించిన తెలుగు అమెరికా తెలంగాణ అసోసియేషన్(టీటీఏ) మెగా కన్వెన్షన్‌లో ఆమె ప్రవాస తెలంగాణవారిని ఉద్దేశించి ప్రసంగించారు. స్థానిక మ□లాలను మరువకుండా ప్రపంచ స్థాయి విజయాలను అందుకోవడమే నిజమైన ప్రగతి అని పేర్కొన్నారు. అమెరికాలోని తెలంగాణ కుటుంబాలు ఐక్యంగా ఉండి భావితరాలకు తెలంగాణ చరిత్ర, సంప్రదాయాలను పరిచయం చేయాలని మంత్రి సూచించారు. ప్రవాస భారతీయులు అక్కడ నేర్చుకున్న సాంకేతికత, నిర్వహణ, పని సంస్కృతి, ఆవిష్కరణలను తెలంగాణ అభివృద్ధికి ఉపయోగించాలని కోరారు. ఒక విద్యార్థికి మార్గదర్శకత్వం, ఒక ప్రభుత్వ పాఠశాలకు చేయూత, ఒక మహిళా సంఘానికి మార్కెట్ అవకాశాలు, ఒక రైతుకు కొత్త సాంకేతికతను పరిచయం చేయడం వంటి సామాజిక బాధ్యతలను స్వీకరించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. స్వయం సహాయక సంఘాలను ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దుతూ మహిళలకు ఉపాధి, వ్యాపార అవకాశాలను విస్తృతంగా కల్పిస్తున్నట్లు చెప్పారు. మహిళల అభివృద్ధికి ప్రవాస తెలంగాణవారు కూడా భాగస్వాములు కావాలని, వారి సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక ఆస్తుల సృష్టికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండూ అభివృద్ధి పథంలో కలిసి ముందుకు సాగాలని, ప్రపంచవ్యాప్తంగా తెలుగు కీర్తిని మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఆదివాసి సంప్రదాయం ప్రకారం వనదేవతలైన సమ్మక్కసారలమ్మ తల్లుల గద్దెల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని మంత్రి సీతక్క ప్రత్యేక పూజలు చేశారు.

# ట్రైనీ ఐపీఎస్ వ్యవహారంలో కొత్త మలుపు

**హైదరాబాద్, జూలై 20:**

జాతీయ పోలీసు అకాడమీలో ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిపై నమోదైన లైంగిక వేధింపుల కేసు కొత్త మలుపు తిరిగింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉదయ్ కృష్ణారెడ్డి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. అనంతరం ఆయన రాశారని చెబుతున్న లేఖ వెలుగులోకి రావడంతో ఈ వ్యవహారం మరింత చర్చనీయాంశమైంది. తమ మధ్య ఉన్నది ఏకపక్ష వేధింపులు కాదని, ఏడాదిగా పరస్పర అంగీకారంతో రిలేషన్‌షిప్‌లో ఉన్నామని ఆ లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది.




***శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నం***

హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో శిక్షణ పొందుతున్న ఉదయ్ కృష్ణారెడ్డి సోమవారం ఉదయం ఎర్రగడ్డలోని బంధువుల ఇంట్లో అపస్మారక స్థితిలో కనిపించారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించారు. శానిటైజర్ సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్య వర్గాలు తెలిపాయి.

***మహిళా అధికారిణి ఆరోపణలు***

కర్ణాటకకు చెందిన సహ ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఉదయ్ కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జూన్ 23 నుంచి జూలై 10 మధ్య తనను లైంగికంగా వేధించారని, అసభ్యకర సందేశాలు పంపారని, భౌతికంగా దాడి చేసి బెదిరించారని ఆమె ఆరోపించారు. తమ వ్యక్తిగత వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేశారని కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

***లేఖలో ఉదయ్ వివరణ***

సోమవారం వెలుగులోకి వచ్చిన లేఖలో ఆరోపణలు నిరాధారమని ఉదయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నట్లు సమాచారం. తమ మధ్య ఏడాదిగా సంబంధం కొనసాగిందని, మహిళకు వివాహమైన తర్వాత కూడా అది కొనసాగిందని ఆయన వివరించినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని, ఈ విషయాన్ని ఆమె భర్తకు కూడా తెలియజేశానని లేఖలో పేర్కొన్నట్లు సమాచారం.

***దర్యాప్తు కొనసాగుతోంది***

ఈ కేసులో మహిళా ట్రైనీ ఐపీఎస్ చేసిన ఆరోపణలు, ఉదయ్ కృష్ణారెడ్డి లేఖలో చేసిన వాదనలు రెండింటినీ పోలీసులు పరిశీలిస్తున్నారు. జాతీయ పోలీసు అకాడమీ కూడా అంతర్గత విచారణ చేపట్టినట్లు సమాచారం. కేసుకు సంబంధించిన అన్ని ఆధారాలను సేకరిస్తూ పోలీసులు సమగ్ర దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# పోలీసు కుటుంబాల సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యం: డీజీపీ సి.వి. ఆనంద్

**హైదరాబాద్, జూలై 20:**

పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమమే తెలంగాణ పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. డీజీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ వెల్ఫేర్ సొసైటీ, ఆరోగ్య భద్రత విభాగాల సమీక్ష సమావేశంలో సంక్షేమ పథకాల అమలు, పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం**

పోలీసు సిబ్బంది జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు విద్య, వైద్యం, వివాహ సహాయం, బీమా, రుణ సదుపాయాలను మరింత బలోపేతం చేయాలని డీజీపీ సూచించారు. పోలీసు పిల్లలకు ప్రతిభా ఉపకార వేతనాలతో పాటు జేఈఈ, నీట్, జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించాలని ఆదేశించారు. వివాహ, వైద్య, విద్యా రుణాలతో పాటు అదనపు బీమా రక్షణ, గ్రాంట్ల ద్వారా కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు.

**ఆరోగ్య భద్రత పథకానికి విశేష స్పందన**

ఆరోగ్య భద్రత పథకం ద్వారా వేలాది మంది పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు వైద్య సేవలు పొందుతున్నట్లు డీజీపీ వెల్లడించారు. 2025లో 33,126 మందికి ఈ పథకం ద్వారా చికిత్స అందించగా, ఇందుకోసం రూ.181.74 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. 2026 జూన్ నాటికి మరో 12,392 మందికి వైద్య సేవలు అందించి రూ.73.61 కోట్లు వ్యయం చేసినట్లు వివరించారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు హోదా ఆధారంగా రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు బీమా రక్షణ కల్పిస్తున్నట్లు చెప్పారు.

**సంక్షేమ నిధుల వినియోగంలో పారదర్శకత**

సంక్షేమ పథకాల దుర్వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని డీజీపీ హెచ్చరించారు. పోలీసు క్యాంటీన్లు, వాణిజ్య సముదాయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని పోలీసు పిల్లల విద్య, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్, సివిల్స్, గ్రూప్స్ శిక్షణ, ఉపకార వేతనాలు, వివాహ సహాయం వంటి సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించాలని అధికారులకు సూచించారు.

**సాంకేతికతతో సేవల విస్తరణ**

సంక్షేమ, ఆరోగ్య భద్రత పథకాల అమలులో సాంకేతికత వినియోగాన్ని మరింత పెంచాలని డీజీపీ ఆదేశించారు. లబ్ధిదారుల వివరాలు, నిధుల వినియోగం, సేవల అమలును పూర్తిగా డిజిటల్ విధానంలో నమోదు చేసి పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించాలని సూచించారు. అలాగే ఓపెన్ ప్లాట్, గృహ, వ్యక్తిగత, కుమార్తె వివాహం, దేశీయ, విదేశీ ఉన్నత విద్య కోసం తక్కువ వడ్డీతో రుణ సదుపాయాలను మరింత సమర్థంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పాల్గొన్న ఉన్నతాధికారులకు తీసుకున్న నిర్ణయాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రతి పోలీసు కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు చేపట్టాలని డీజీపీ సి.వి. ఆనంద్ సూచించారు.

# డీలిమిటేషన్‌కు కొత్త ఫార్ములా.. దక్షిణాది వైఖరిలో మార్పు?

మొదటిపేజీ తరువాయి

డీఎంకే వైఖరి రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. జనాభా ప్రాతిపదికన మాత్రమే డీలిమిటేషన్ జరిగితే అత్యధికంగా ప్రభావితమయ్యే రాష్ట్రాల్లో తమిళనాడు ఒకటి. అయితే 50 శాతం పెంపు విధానం అమల్లోకి వస్తే ప్రస్తుతం ఉన్న 39 లోక్‌సభ స్థానాలు దాదాపు 59కు పెరిగే అవకాశం ఉంటుందని అంచనాలు వినిపిస్తున్నాయి. దీంతో పార్లమెంట్‌లో రాష్ట్ర ప్రాతినిధ్యం మరింత బలపడుతుందనే కోణంలో ఈ ప్రతిపాదనను డీఎంకే పరిశీలిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.



**తెలుగు రాష్ట్రాల్లోనూ సానుకూల సంకేతాలు**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో కూడా ఈ విధానంపై అనుకూల అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 17 లోక్‌సభ స్థానాలు 25 లేదా 26కు, ఆంధ్రప్రదేశ్‌లోని 25 స్థానాలు 37 లేదా 38కు పెరిగే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. దీంతో ప్రాంతీయ పార్టీలకు మరింత రాజకీయ విస్తరణతో పాటు కొత్త నాయకత్వానికి అవకాశాలు పెరుగుతాయని భావిస్తున్నారు.

**రాజకీయ వ్యూహాలకు కొత్త దిశ**

జనాభా ప్రాతిపదికన జరిగే డీలిమిటేషన్‌ను పూర్తిగా అడ్డుకోవడం రాజ్యాంగపరంగా సాధ్యం కాదనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రాలకు అదనపు ప్రాతినిధ్యం కల్పించే విధంగా ఏకరీతి సీట్ల పెంపు ప్రతిపాదన అమలైతే అది రాజీ మార్గంగా మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అదే సమయంలో ఉత్తరాది రాష్ట్రాల జనాభా పెరుగుదలకు అనుగుణంగా అక్కడ కూడా ప్రాతినిధ్యం పెంచే అవకాశాన్ని కేంద్రం పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**అధికారిక ప్రకటన కోసం ఎదురుచూపులు**

అయితే ఈ యూనిఫాం 50 శాతం సీట్ల పెంపు విధానంపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు. ప్రస్తుతం వినిపిస్తున్న అంశాలు రాజకీయ చర్చలు, విశ్లేషణల ఆధారంగానే ఉన్నాయి. భవిష్యత్తులో కేంద్రం ప్రకటించే అధికారిక విధానం, డీలిమిటేషన్ కమిషన్ సిఫార్సుల ఆధారంగానే తుది రూపురేఖలు స్పష్టమయ్యే అవకాశం ఉంది. అందువల్ల ఈ అంశంపై తుది నిర్ణయం వచ్చే వరకు అధికారిక ప్రకటనల కోసం వేచిచూడాల్సిన అవసరం ఉంది.

## త్రిపుర డీజీపీ అనుమానాస్పద మృతి!

**తెలంగాణ బ్యూరో, :**

త్రిపుర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) అనురాగ్ ధన్‌ఖడ్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో విగతజీవిగా పడి ఉన్న ఆయనను సోమవారం పోలీసులు గుర్తించారు. అనురాగ్ ఆత్మహత్య చేసుకుని చనిపోయి ఉండొచ్చని వారు అనుమానిస్తున్నారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తు వివరాల మేరకు.. అనురాగ్ తన సర్వీస్ పిస్టల్‌తో కాల్చుకున్నారు. ఆయనను గోవింద్ భల్లబ్ పంత్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. అనురాగ్ మరణానికి గల సరైన కారణాలు ఇంకా తెలియరాలేదు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, అనురాగ్ ధన్‌ఖడ్ 1994 బ్యాచ్‌కు చెందిన త్రిపుర క్యాడర్ ఐపీఎస్. 2025 మే నెలలో త్రిపుర డీజీపీగా బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు త్రిపురలో డైరెక్టర్ జనరల్(ఇంటెలిజెన్స్) గా పని చేశారు. ఆయన సీబీఐలో కూడా విశేషమైన సేవలు అందించారు.

## వారం రోజుల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**హైదరాబాద్, జూలై 20:**

రాష్ట్రంలోని అర్హులైన పేదలకు ఆధునిక సాంకేతికతతో రూపొందించిన పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డులను వారం రోజుల్లో పంపిణీ చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ వెల్లడించింది. ప్రస్తుతం వినియోగంలో ఉన్న కాగితపు రేషన్ కార్డుల స్థానంలో కొత్త ప్లాస్టిక్ స్మార్ట్ కార్డులను అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పంపిణీని ప్రారంభించనున్నారు.



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా లబ్ధిదారులకు పీవీసీ స్మార్ట్ రేషన్ కార్డులు అందించనున్నారు. ప్రస్తుతం ఉన్న కాగితపు కార్డులు త్వరగా చిరిగిపోవడం, పాడవడం వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. కొత్త కార్డులపై లబ్ధిదారుడి వివరాలతో పాటు స్పందన సంకేతం, ఆహార భద్రతా కార్డు సంఖ్య, ఇతర భద్రతా గుర్తులను ముద్రించారు.

రాష్ట్ర రాజధానిలో ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రారంభించనున్న సమయంలోనే 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల చేతుల మీదుగా లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజు ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు పౌరసరఫరాల శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. స్మార్ట్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, సేవల సామర్థ్యం మరింత పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. భద్రతా ప్రమాణాలు మెరుగుపడటంతో నకిలీ కార్డులకు అడ్డుకట్ట పడుతుందని, ఆధునిక సాంకేతికతతో రూపొందించిన ఈ కార్డులు దీర్ఘకాలం ఉపయోగపడతాయని తెలిపారు.

ఇదిలా ఉండగా, రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆగస్టు 1 నుంచి నెల రోజుల పాటు రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులు తమ కోటా మేరకు బియ్యాన్ని పొందవచ్చని అధికారులు తెలిపారు.

రేషన్ సరుకులు పొందేందుకు ఈకేవైసీ పూర్తి చేయడం తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు. ఈకేవైసీ పూర్తి చేసుకునేందుకు జూలై 31ను చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు కూడా సమీపంలోని రేషన్ దుకాణంలో ఈ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని సూచించారు. గడువులోగా ఈకేవైసీ పూర్తి చేయని వారికి రేషన్ సరుకుల పంపిణీ ఉండదని అధికారులు హెచ్చరించారు.

# ఆయిల్ పామ్‌తో రైతుకు స్థిరమైన ఆదాయం

మొదటిపేజీ తరువాయి

రూ.300 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన గోద్రెజ్ ఇంటిగ్రేటెడ్ పామ్ ఆయిల్ పరిశ్రమను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, గోద్రెజ్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులతో కలిసి ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలో అనేక పరిశ్రమలు ఉండేవి.. జిల్లాల పునర్విభజన తర్వాత ఖమ్మం జిల్లా కేవలం వ్యవసాయానికే పరిమితమైందని, ఇక్కడ నాగార్జున సాగర్ ఎడమ కాల్వ నీటి ప్రవాహం, పాలేరు, వైరా రిజర్వాయర్లు.. వీటి మీద ఆధారపడి ఇక్కడి రైతులు వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయం మన జీవన ఆధారంగా మారిన పరిస్థితుల్లో రైతులకు అధిక దిగుబడి, రాబడి వచ్చేలా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా రైతులు ఆయిల్ పామ్ సాగువైపు మళ్లాలని సూచించారు. ఎల్‌నినో వంటి విపత్కర పరిస్థితులు, వర్షాభావ స్థితిగతులు ఏర్పడినా ఆయిల్ పామ్ సాగులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాబోవన్నారు. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు రైతులకు□ ఎకరాకు రూ.4 నుంచి రూ.45 వేల వరకు సబ్సిడీని కూడా అందిస్తున్నట్లు చెప్పారు. ఈరోజు దేశంలో 25 లక్షల మిలియన్ టన్నుల పామ్ ఆయిల్ అవసరం ఉంటే 12 లక్షల మిలియన్ టన్నులు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో మిగిలిన దాంట్లో కేవలం మ□డు లక్షల టన్నుల పామాయిల్‌ను దేశం దిగుమతి చేసుకుంటున్నదని ఉప ముఖ్యమంత్రి భట్టి అన్నారు. ఈ దిగుమతి వల్ల రూ.1.5 లక్షల కోట్లు విదేశీ మారకంగా వేరే దేశాలకు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇదే పామాయిల్‌ను మనం ఇక్కడే ఉత్పత్తి చేయగలిగితే దేశానికి ఆర్థికంగాను, రైతుకు లాభసాటిగా కూడా ఉంటుందని చెప్పారు.ఉమ్మడి ఏపీలో 199192 ప్రాంతంలో నాటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి ఆయిల్ పామ్ సాగును రాష్ట్రంలో మొదటిసారి ప్రోత్సహించినట్లు చెప్పారు. ఆనాటి ఖమ్మం జిల్లాలో ముఖ్యంగా అశ్వారావుపేట, సత్తుపల్లి వంటి పరిసర ప్రాంతాలు దీనికి ఉపయోగపడతాయని చెప్పి సర్వే చేయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆయిల్ పామ్ పోత్సహించేందుకు ఆనాడు వేసిన బీజాలు ఈరోజు పరిశ్రమ ప్రారంభం చేసుకునే వరకు వచ్చిందన్నారు. దేశంలో దాదాపు 70 లక్షల ఎకరాలకు సాగు చేయాల్సిన అవసరం ఉంటే కేవలం 15 లక్షల ఎకరాల్లోనే చేసుకోగలుగుతున్నామని, పూర్తిస్థాయిలో సాగు చేయగలిగితే దేశ ఆర్థిక వ్యవస్థకు దన్నుగా నిలవగలమని చెప్పారు. 199192లో మొదలుపెట్టిన ఈ సాగు నేడు 3 లక్షల ఎకరాలకు చేరిందని, ఆయిల్ పామ్ సాగుకు రాష్ట్రంలోనూ, దేశంలోనూ మంచి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. 2023లో టన్ను గెల ధర రూ.12,500 ఉంటే ఈరోజు రూ.23,000ల వరకు ఉందని లెక్కలు చెబుతున్నాయని, రెండు మూడేళ్లలోనే ఆయిల్ పామ్ ధర ఎంత పెరిగిందో అర్థం చేసుకోవాలని అన్నారు. ఆయిల్ పామ్ ద్వారా రైతాంగ సోదరులు సమృద్ధిగా ఎదిగే అవకాశం ఉందన్నారు. పామ్ ఆయిల్ ఇండస్ట్రీని ఈరోజు కొణిజర్ల మండలంలోని అంజనాపురం గ్రామంలో ప్రారంభోత్సవం చేసుకున్నామని, వ్యవసాయం మీద మాత్రమే ఆధారపడి ఉన్న ఖమ్మం జిల్లా రైతాంగ సోదరులకు ఇదొక మంచి వరంగా తాను భావిస్తున్నట్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ పరిశ్రమను ప్రారంభించే సందర్భంలో ఇంకా అభివృద్ధి చెందడానికి కావలసిన రహదారులు కావాలని అడిగారంటూ అందుకోసం ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ద్వారా రహదారులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేస్తుందని చెప్పారు. ఇది యాంకర్ ఇండస్ట్రీగా మారి అనేక అనుబంధ పరిశ్రమలు ఈ పరిసర ప్రాంతాలకు రావాలని, ఈ ప్రాంతం ఆగ్రో బేస్డ్ ఇండస్ట్రీస్‌కు ఒక మంచి కేంద్రంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. పామ్ ఆయిల్‌కు అవసరమైన సీడ్‌ను మలేషియా, ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకునే పరిస్థితి నుంచి ఇక్కడినుంచే దేశానికి అవసరమైన విత్తనాలను అందించే స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు.



**కూలీలతో ఉప ముఖ్యమంత్రి భట్టి మాటామంతి**

గండగలపాడు నుంచి స్నానాల లక్ష్మీపురం వెళ్లే మార్గమధ్యంలో ఒక అద్భుతమైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కాన్వాయ్ అకస్మాత్తుగా ఆగింది. భద్రతా సిబ్బంది అలర్ట్ అయ్యేలోపే ఆయనే స్వయంగా రోడ్డు పక్కన పొలాల్లో పనులు చేసుకుంటున్న రైతు కూలీల వైపు వెళ్లారు. డిప్యూటీ సీఎం తమ వద్దకు రావడంతో కూలీలు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. వారితో చేతులు కలిపేందుకు, మాట్లాడేందుకు అక్కడి వారంతా పోటీ పడ్డారు. పొలం గట్టుపై నిలబడి కూలీలతో ఎంతో ఆత్మీయంగా ముచ్చటించారు. నేరుగా లబ్ధిదారులతోనే సంక్షేమ ఫలాల తీరును అడిగి తెలుసుకున్నారు. అక్కయ్యా.. ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ మీకు అందుతున్నాయా, మీ ఇంటికి ఉచిత విద్యుత్ సరఫరా వస్తోందా, రేషన్ షాప్ నుంచి సన్న బియ్యం తెచ్చుకుని తింటున్నారా, అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయా అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు కూలీలు ఎంతో సంతోషంగా స్పందిస్తూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలన్నీ మాకు అందుతున్నాయి సార్.. ముఖ్యంగా మాలాంటి నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది అని తమ ఆనందాన్ని పంచుకున్నారు.

**ఉప ముఖ్యమంత్రి దృష్టికి రవాణా కష్టాలు**

ఇదే సమయంలో కూలీలు తమ రోజువారీ ఇబ్బందులను కూడా డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వైరా నుంచి ముసలిమడుగు వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల తాము పడుతున్న ఇబ్బందులను వివరించారు. బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు.

**పది లక్షల ఎకరాలకు పెంచడమే ప్రభుత్వ లక్ష్యం : తుమ్మల**

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా గోద్రెజ్ సంస్థ ఆయిల్ పామ్ గెలల కొనుగోలు లో రైతులకు భాగస్వామిగా నిలుస్తోందని తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో ఆయిల్ పామ్ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేసే అవకాశాలు మరింత విస్తరించాయని, దేశంలోనే ఆయిల్ పామ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఒకప్పుడు ఉమ్మడి ఖమ్మం జిల్లాకే పరిమితమైన ఆయిల్ పామ్ సాగు, నేడు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరించిందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 3 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని, రానున్న 2 నుంచి 3 సంవత్సరాల్లో దానిని 10 లక్షల ఎకరాలకు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. దేశం వంటనూనెల్లో స్వయం సమృద్ధి సాధించాలంటే సుమారు 70 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు అవసరమని చెప్పారు. ప్రస్తుతం దేశంలోని ఆయిల్ పామ్ సాగులో దాదాపు 90 శాతం తెలుగు రాష్ట్రాల నుంచే జరుగుతోందన్నారు. తెలంగాణలో ఇప్పటి వరకు మూడు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు పనిచేస్తుండగా, గోద్రెజ్ ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమ నాలుగో ఫ్యాక్టరీ అని తెలిపారు. దేశంలో ఇప్పటి వరకు ఆయిల్ పామ్‌కు ప్రత్యేక సీడ్ గార్డెన్ లేకపోవడం గమనార్హమని, గోద్రెజ్ సంస్థ మలేషియా భాగస్వామ్యంతో ఖమ్మంలో దేశంలోనే తొలి ఆధునిక సీడ్ గార్డెన్‌ను ఏర్పాటు చేస్తోందని చెప్పారు. సీడ్ గార్డెన్‌తో పాటు పరిశోధన కేంద్రం, రైతులకు అవగాహన కల్పించే ప్రదర్శన విభాగాలు, శిక్షణా కార్యక్రమాలు, నాణ్యమైన నర్సరీల ఏర్పాటు వంటి కార్యక్రమాలకు కూడా నేటి నుంచే శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. సభలో రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, గోద్రెజ్ ఇండస్ట్రీస్ చైర్మన్ నాదిర్ బి. గోద్రెజ్, ఆగ్రోవెట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సునీల్ కటారియా, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, ఖమ్మం కలెక్టర్ దివాకర్, సీపీ సునీల్ దత్, గోద్రెజ్ సంస్థ ప్రతినిధులు సౌగత నియోగి, రాకేష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టులో మరో నాలుగు జడ్జీల పోస్టులు

**న్యూఢిల్లీ, జూలై 20:**

సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను పెంచేందుకు ఉద్దేశించిన సుప్రీంకోర్టు (జడ్జీల సంఖ్య) సవరణ బిల్లు-2026ను కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ బిల్లును సభ ముందుంచారు. ఈ బిల్లు ఆమోదం పొందితే ప్రస్తుతం ప్రధాన న్యాయమూర్తిని మినహాయించి 33 మంది ఉన్న జడ్జీల సంఖ్య 37కు పెరగనుంది.

1956లో అమల్లోకి వచ్చిన సుప్రీంకోర్టు (జడ్జీల సంఖ్య) చట్టంలో ఈ బిల్లు ద్వారా సవరణలు చేయనున్నారు. ఇదే అంశంపై కేంద్ర ప్రభుత్వం గతంలో ఆర్డినెన్స్ జారీ చేయగా, ఇప్పుడు దానికి చట్టబద్ధత కల్పించేందుకు పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టింది. వర్షాకాల సమావేశాల తొలి రోజే ఈ బిల్లును సభ ముందుకు తీసుకురావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**పెండింగ్ కేసుల భారం తగ్గించడమే లక్ష్యం**

ఈ సవరణ అమల్లోకి వస్తే ప్రధాన న్యాయమూర్తితో కలిపి సుప్రీంకోర్టు మొత్తం ఆమోదిత బలం 38కు చేరుకుంటుంది. ప్రస్తుతం ఆమోదిత పోస్టులన్నీ భర్తీ కాలేదని, జడ్జీల సంఖ్య పెరగడం ద్వారా పెండింగ్‌లో ఉన్న కేసుల భారాన్ని తగ్గించి వేగంగా న్యాయసేవలు అందించడమే లక్ష్యమని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

**పార్లమెంట్‌కు ఉన్న అధికారం**

భారత రాజ్యాంగంలోని 124వ అధికరణం ప్రకారం సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను చట్టం ద్వారా నిర్ణయించే అధికారం పార్లమెంట్‌కు ఉంది. ఇందుకోసం రాజ్యాంగ సవరణ అవసరం లేకుండా సాధారణ మెజారిటీతోనే బిల్లును ఆమోదించవచ్చు. దీంతో ఈ బిల్లు త్వరగా ఆమోదం పొందే అవకాశాలు ఉన్నాయని న్యాయవర్గాలు భావిస్తున్నాయి.

**గతంలోనూ పలు దఫాలుగా పెంపు**

సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను గతంలో కూడా పలు దఫాలుగా పెంచారు. 1956లో ప్రధాన న్యాయమూర్తితో కలిపి 10 మంది ఉన్న జడ్జీల సంఖ్యను 1960లో 13కు, 1977లో 17కు, 1986లో 25కు, 2008లో 30కు, 2019లో 34కు (ప్రధాన న్యాయమూర్తితో కలిపి) పెంచారు. ఇప్పుడు మరో నాలుగు పోస్టులను చేర్చుతూ కేంద్ర ప్రభుత్వం తాజా సవరణను తీసుకొచ్చింది. కొత్త పోస్టులు భర్తీ అయితే రాజ్యాంగ, పౌర, క్రిమినల్ తదితర కీలక కేసుల విచారణ మరింత వేగవంతమవుతుందని, సుప్రీంకోర్టు పనితీరు మరింత సమర్థవంతంగా మారుతుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం

**హైదరాబాద్, జూలై 20:**

హైదరాబాద్ నగరంలో ఇల్లు లేని పేద కుటుంబాలకు గృహ భద్రత కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ నగర పరిధిలో తొలి విడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సోమవారం శ్రీకారం చుట్టారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులతో పాటు హైదరాబాద్ పరిధిలోని 16 నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. హైదరాబాద్ వంటి మహానగరంలో ప్రభుత్వ భూములపై పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టడం చారిత్రాత్మక నిర్ణయమని మంత్రులు పేర్కొన్నారు. అర్హులైన నిరుపేద కుటుంబాలకు దశలవారీగా ఇళ్లను పారదర్శకంగా కేటాయిస్తామని స్పష్టం చేశారు.

తొలి దశలో ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున అల్పాదాయ వర్గాల కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోని ప్రభుత్వ భూముల్లోనే ఇళ్ల నిర్మాణం చేపట్టి వారి జీవనోపాధికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహిస్తామని, ఎలాంటి సిఫార్సులు, పైరవీలకు అవకాశం ఉండదని మంత్రులు స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల అర్హతలు, దరఖాస్తు విధానం, ఇతర వివరాలతో రూపొందించిన సమాచార పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో మహిళలకు ప్రాధాన్యం కల్పిస్తూ ఇంటి పట్టాలను మహిళల పేరిటే జారీ చేయనున్నట్లు తెలిపారు. దీంతో మహిళలకు సొంతింటిపై హక్కు కలగడంతో పాటు వారి ఆర్థిక, సామాజిక భద్రత మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. మహిళా సాధికారతకు ఈ నిర్ణయం దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి పేరు సూచిస్తూ నిర్వహించిన సామాజిక మాధ్యమాల పోటీలో విజేతగా నిలిచిన నల్గొండ జిల్లాకు చెందిన కొండా నాగరాజుకు రూ.లక్ష నగదు ప్రోత్సాహకాన్ని మంత్రులు అందజేశారు. రాష్ట్రంలో ఇప్పటికే తొలి విడతగా మంజూరైన 4.50 లక్షల ఇళ్లతో పాటు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో 2.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్ల మంజూరుతో మొత్తం 8 లక్షలకు పైగా పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.



## అమరవీరుల ఆశయ సాధనే లక్ష్యం: జూపల్లి కృష్ణారావు

- **షాద్‌నగర్‌లో తెలంగాణ అమరవీరుల స్థూపం ఆవిష్కరణ**
- **ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు చాటాల్సిన అవసరంపై మంత్రి పిలుపు**

**రంగారెడ్డి, జూలై 20:**

అమరవీరులు కలలుగన్న తెలంగాణ నిర్మాణం, వారి ఆశయాల సాధనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొంటూ, వారి ఆశయాలను సాకారం చేస్తూ ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు. షాద్‌నగర్ పట్టణంలో నిర్మించిన తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని సోమవారం మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులకు పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ కోసం ఎందరో యువకులు తమ ప్రాణాలను అర్పించారని అన్నారు. "మా చావులతో తెలంగాణ రావాలి" అనే సంకల్పంతో ఆత్మబలిదానం చేసిన అమరవీరుల త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను భావితరాలు ఎప్పటికీ గుర్తుంచుకునేలా రాష్ట్రవ్యాప్తంగా స్మారక చిహ్నాల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. షాద్‌నగర్‌లో అమరవీరుల స్థూపం ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను యువతకు చేరవేయడంలో ఇలాంటి స్మారక స్థూపాలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. అమరవీరుల త్యాగస్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, తెలంగాణ ఉద్యమకారులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొని అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.

# ఎల్‌టీసీజీ పన్ను రద్దు లేదు: కేంద్రం



షేర్ మార్కెట్ ఇన్వెస్టర్లకు కేంద్ర ప్రభుత్వం కీలక సమాచారం ఇచ్చింది. లిస్టెడ్ ఈక్విటీలపై లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ పన్నును రద్దు చేసే యోచనేదీ ప్రస్తుతానికి లేదని కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో స్పష్టం చేసింది. రిటైల్, దేశీయ ఇన్వెస్టర్లకు ఈ లెవీని తొలగించాలనే ప్రతిపాదన ఏదీ పరిశీలనలో లేదని ప్రభుత్వం తేల్చి చెప్పింది.మార్కెట్ సెంటిమెంట్‌ను పెంచేందుకు ఈ పన్నును ఉపసంహరించుకోవాలని మార్కెట్ వర్గాల నుంచి వస్తున్న డిమాండ్లపై లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. వార్షిక బడ్జెట్ ప్రక్రియలో భాగంగా, విస్తృత స్థూల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ రేట్లు సహా పన్ను విధానాలను క్రమానుగతంగా సమీక్షిస్తామని ఆయన పేర్కొన్నారు.

**రద్దు చేయాలని డిమాండ్లు ఎందుకు?**

ఈక్విటీ మార్కెట్లు రికార్డు స్థాయిలను తాకడం, రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం భారీగా పెరగడంతో ఈ పన్నును రద్దు చేయాలనే లేదా మినహాయింపు పరిమితిని పెంచాలనే డిమాండ్ కొంతకాలంగా వినిపిస్తోంది. ఈ పన్ను దీర్ఘకాలిక పెట్టుబడులను నిరుత్సాహపరుస్తోందని, పన్నుల తర్వాత వచ్చే రిటర్న్స్‌ను తగ్గిస్తోందని కొందరు ఇన్వెస్టర్లు వాదిస్తున్నారు. అలాగే, ప్రభుత్వ సెక్యూరిటీలలో పెట్టుబడి పెట్టే విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లకు ప్రభుత్వం ఇటీవల పన్ను మినహాయింపులు ప్రకటించిన నేపథ్యంలో.. దేశీయ ఇన్వెస్టర్లకు కూడా సమానత్వం కల్పించాలని మార్కెట్ నిపుణులు కోరుతున్నారు.

**ప్రభుత్వానికి కాసుల వర్షం.. పెరిగిన వసూళ్లు!**

ఇన్వెస్టర్ల డిమాండ్లు ఎలా ఉన్నప్పటికీ, ఈక్విటీ లాభాలపై పన్ను వసూళ్లు భారీగా పెరగడంతో ప్రభుత్వం ఈ పన్నును వదులుకోవడానికి సిద్ధంగా లేదని స్పష్టమవుతోంది. పార్లమెంట్‌లో షేర్ చేసిన డేటా ప్రకారం.. అసెస్మెంట్ ఇయర్ 202425 వసూళ్లు రూ.72,249 కోట్లు కాగా, అసెస్మెంట్ ఇయర్ 202526 వసూళ్లు రూ.1,29,158 కోట్లకి పెరిగాయి. కేవలం ఏడాది కాలంలోనే ఎల్‌టీసీజీ పన్ను వసూళ్లు ఏకంగా 78శాతం వృద్ధి సాధించడం విశేషం. ప్రభుత్వ ఖజానాకు ఈ పన్ను ద్వారా వస్తున్న ఆదాయం ఎంత కీలకంగా మారిందో ఈ గణాంకాలు నిరూపిస్తున్నాయి.

**ప్రస్తుతం అమలులో ఉన్న క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ రేట్లు:**

లిస్టెడ్ షేర్లు లేదా ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్లను కొనుగోలు చేసిన ఒక సంవత్సరం తర్వాత విక్రయిస్తే వచ్చే లాభాలను లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్గా పరిగణిస్తారు. అయితే, ఒక ఆర్థిక ఏడాదిలో రూ.1.25 లక్షల వరకు లాభాలపై పన్ను లేదు. రూ.1.25 లక్షల పరిమితి దాటిన లాభాలపై 12.5శాతం పన్ను విధిస్తారు. ఒక ఏడాది లోపే విక్రయిస్తే వచ్చే షార్ట్ టర్మ్ లాభాలపై 20శాతం పన్ను ఉంటుంది. దీని ప్రకారం 2024 జూలై యూనియన్ బడ్జెట్‌లో ప్రకటించిన ఈ రేట్లలో ప్రస్తుతం ఎలాంటి మార్పూ లేదు.మార్కెట్ నిపుణులు, ఇన్వెస్టర్లు ఎల్‌టీసీజీ రేట్లలో ఉపశమనం లభిస్తుందని ఆశించినప్పటికీ, ప్రభుత్వ తాజా వివరణతో ఆ అంచనాలకు బ్రేక్ పడింది. పన్ను విధానాల సమీక్ష అనేది నిరంతర ప్రక్రియే అయినప్పటికీ, ప్రస్తుతానికైతే ఎల్‌టీసీజీ పన్నును రద్దు చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదన్నది ఇవాళ్టి ప్రకటనతో స్పష్టమైంది.

# అపార్ ఐడీ పూర్తి స్వచ్ఛందం..

## నిరాకరిస్తే అడ్మిషన్లు ఆపొద్దు: సుప్రీంకోర్టు




దేశంలోని విద్యార్థులందరికీ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 'అపార్'ఐడీపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇవాళ (సోమవారం) కీలక ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థుల విద్యాసంబంధిత రికార్డులను ఒకే చోట భద్రపరిచేందుకు ఉద్దేశించిన ఈ ఐడీ నమోదు ప్రక్రియ పూర్తి స్వచ్ఛందమని కోర్టు స్పష్టం చేసింది. ఆధార్ లేదా అపార్ ఐడీలు లేవనే సాకుతో ఏ విద్యార్థికీ విద్యాసంస్థల్లో ప్రవేశాలు (అడ్మిషన్లు) లేదా మార్క్స్ మెమోలను నిరాకరించడానికి వీల్లేదని ధర్మాసనం తేల్చి చెప్పింది.

**కోర్టు ఆదేశాల్లోని ముఖ్యాంశాలు:**

**ఆప్ట్-అవుట్ ఎంపిక తప్పనిసరి:**

విద్యార్థులు లేదా వారి తల్లిదండ్రుల నుంచి అపార్ ఐడీ కోసం సమ్మతి పత్రాలు తీసుకునేటప్పుడు, అందులో 'ఆప్ట్అవుట్' (ఐడీ వద్దనుకునే) ఎంపికను స్పష్టంగా చేర్చాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఎవరినీ బలవంతంగా.

**డేటా దుర్వినియోగం కాకూడదు:**

విద్యార్థుల నుంచి సేకరించే వ్యక్తిగత, విద్యా సమాచారాన్ని కేవలం విద్యాసంబంధిత అవసరాలకే ఉపయోగించాలి. ఈ డేటాను ఏ ఇతర వాణిజ్య లేదా వెలుపలి ప్రయోజనాలకు వినియోగించరాదని విద్యాశాఖను హెచ్చరించింది.

**హక్కులను నిరాకరించలేరు:**

దేశంలో ప్రతి బిడ్డకు విద్యా హక్కు ఉంది. కాబట్టి, కేవలం ఆధార్ కార్డు లేదా అపార్ ఐడీ లేదనే కారణంతో విద్యార్థులకు అడ్మిషన్లు నిలిపివేయడం, ఫలితాలు ఆపడం లేదా మార్కుల జాబితాలను ఇవ్వకుండా వేధించడం చట్టవిరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది.

**అపార్ ఐడీ అంటే ఏమిటి?**

కేంద్ర విద్యాశాఖ 'వన్ నేషన్, వన్ స్టూడెంట్ ఐడీ' పాలసీ కింద దీనిని ప్రవేశపెట్టింది. ఇది విద్యార్థుల విద్యా ప్రయాణాన్ని ట్రాక్ చేసే ఒక డిజిటల్ లాకర్ లాంటిది. ఇందులో విద్యార్థి సాధించిన మార్కులు, డిగ్రీలు, స్పోర్ట్స్ సర్టిఫికెట్లు, ఇతర నైపుణ్యాల వివరాలన్నీ డిజిటల్ రూపంలో నిక్షిప్తమై ఉంటాయి. అయితే, దీనిలో డేటా భద్రత, ప్రైవసీపై ఆందోళనలు వ్యక్తమవడంతో సుప్రీంకోర్టు ఈ పరిమితులను విధించింది.

**విద్యార్థులు, తల్లిదండ్రులకు ఊరట**

సుప్రీంకోర్టు తాజా ఆదేశాలతో విద్యాసంస్థల యాజమాన్యాల ఇష్టారాజ్యానికి అడ్డుకట్ట పడినట్లయింది. చాలా చోట్ల అపార్ ఐడీ లేకపోతే అడ్మిషన్లు ఇవ్వమని ఒత్తిడి తెస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో, ఈ తీర్పు కోట్లాది మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు పెద్ద ఊరటగా నిలిచింది. డిజిటలైజేషన్ పేరుతో విద్యార్థుల ప్రాథమిక హక్కులకు భంగం కలగకూడదని న్యాయస్థానం ఈ తీర్పు ద్వారా స్పష్టం చేసింది.

## 20 శాతానికి మించి ఇథనాల్ బ్లెండింగ్‌పై నిర్ణయం తీసుకోలేదు!



పెట్రోల్‌లో 20 శాతానికి మించి ఇథనాల్ కలిపే అంశంపై ఇంకా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి తెలిపారు. శాస్త్రీయ పరిశోధనలు, ఆటోమొబైల్, ఆయిల్ మార్కెటింగ్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూషన్లతో సంప్రదింపులు జరిపాకే తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఈ మేరకు రాజ్యసభలో ఓ ఎంపీ అడిగిన ప్రశ్నకు ఆయన లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. నిర్ణీత గడువు కంటే ముందే భారత్ 20 శాతం ఇథనాల్ బ్లెండింగ్ లక్ష్యాన్ని చేరుకుందని సురేశ్ గోపి ఈ సందర్భంగా తన సమాధానంలో పేర్కొన్నారు. 20132014లో 1.53 శాతం మాత్రమే ఉన్న బ్లెండింగ్‌ను 202526 నాటికి 20 శాతానికి చేర్చామన్నారు. 2014 15 నుంచి ఇప్పటి వరకు ఇథనాల్ ప్రోగ్రామ్ కింద రూ.1.97 లక్షల కోట్ల విదేశీ మారకాన్ని ఆదా చేసినట్లు తెలిపారు. 316 లక్షల టన్నుల క్రూడాయిల్ ఆదా అవ్వడంతో పాటు 952 లక్షల టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గింపు సాధ్యమైందని తెలిపారు. రైతులకు రూ.1.66 లక్షల కోట్ల ఆదాయం సమకూరిందని తెలిపారు.E20 ఇంధనానికి సంబంధించి ఇంజిన్ వైఫల్యం, ఫ్యూయల్‌పంప్ సమస్యలు, తుప్పు పట్టడం వంటి విషయాల్లో వాహన తయారీదారులు, ఆటోమొబైల్ సంఘాలు లేదా వినియోగదారుల బృందాల నుంచి ప్రభుత్వానికి ఎలాంటి ఫిర్యాదులూ అందలేదని తెలిపారు. మీడియా, సోషల్ మీడియాలో వ్యక్తమైన ఆందోళనలను ప్రభుత్వం పరిశీలించిందని మంత్రి వెల్లడించారు. దేశంలో 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఈ20 సర్టిఫికేషన్‌తో నడుస్తున్నాయని తెలిపారు. బ్లెండింగ్ చేయని, లేదా తక్కువ బ్లెండింగ్ కలిగిన పెట్రోల్‌ను వేర్వేరుగా విక్రయించే అంశం ఏదీ ప్రతిపాదనలో లేదని సురేశ్ గోపి పేర్కొన్నారు.

## ఇక ఆండ్రాయిడ్ ఆటో యూజర్లకూ

# లైవ్ స్పీడోమీటర్

ఆండ్రాయిడ్ ఆటో వినియోగదారులు ఎంతోకాలం నుంచి ఎదురుచూస్తున్న సరికొత్త ఫీచర్‌ను ఎట్టకేలకు గూగుల్ తీసుకొస్తోంది .బీటా అప్‌డేట్ ద్వారా గూగుల్ మ్యాప్స్‌లో లైవ్ స్పీడో మీటర్‌ను రోల్‌అవుట్ చేస్తోంది. దీంతో, ఇక నుంచి వాహన స్పీడ్ లిమిట్‌ను సులువుగా తెలుసుకోవచ్చు. చాలా కాలం నుంచి ఈ ఫీచర్ ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ యూజర్లకు దర్శనమిస్తోంది. 2024లో యాపిల్ కార్‌ప్లేకు తీసుకురాగా, ఇప్పుడు ఆండ్రాయిడ్ ఆటో యూజర్లకూ అందుబాటులోకి రానుంది. ఇకపై ఆండ్రాయిడ్ ఆటోపై గూగుల్ మ్యాప్స్ ఇంటర్‌ఫేస్‌లో నేరుగా వాహన స్పీడ్ దర్శనమిస్తుంది. లైవ్ స్పీడో మీటర్ ద్వారా వాహన ప్రస్తుత వేగాన్ని తెలుసుకోవచ్చు. కారు ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌ను స్విచ్ చేయకుండానే వాహన వేగాన్ని పర్యవేక్షించొచ్చు. మలుపుల వద్ద దిశానిర్దేశాలను గమనించొచ్చు. ఇందుకోసం ఆండ్రాయిడ్ ఆటో లేటెస్ట్ బీటా వెర్షన్‌ను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే, ఈ ఫీచర్ ఇప్పటికే పరిమిత యూజర్లకు అందుబాటులోకి రాగా, దశలవారీగా త్వరలోనే అందరికీ అందుబాటులోకి తేనున్నారు.



# ఆగని దాడులు.. ప్రతిదాడులు!



ఇరాన్‌పై అమెరికా ప్రతీకార దాడులకు దిగింది. జోర్డాన్‌లోని తమ స్థావరంపై దాడి చేసి ఇద్దరు సైనికుల మృతికి కారణమైందంటూ ఆదివారం తెల్లవారుజామున విరుచుకుపడింది. ఇరాన్ దక్షిణ తీర ప్రాంతం, హోర్ముజ్ జలసంధి సమీప ప్రాంతాల్లో బాంబుల వర్షం కురిపించింది. తీర ప్రాంత నిఘా వ్యవస్థలు, పోర్టుల్లో మౌలిక వసతులు, గగనతల రక్షణ వ్యవస్థలు, క్షిపణి, డ్రోన్ నిల్వ కేంద్రాలను ధ్వంసం చేశామని అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ఇరాన్ పర్వత ప్రాంతాల్లో ఉన్న కీలకమైన ది గార్డ్ స్థావరం, హోర్ముజ్‌లోని ఖేష్మ్ దీవిపైనా తోమహాక్ క్షిపణులతో దాడిచేసినట్టు తెలిపింది. ఇక ఇరాన్ కూడా ప్రతిదాడులకు దిగింది. జోర్డాన్, బహ్రెయిన్, కువైట్, ఖతార్, యూఏఈ తదితర దేశాల్లోని అమెరికా స్థావరాలపైకి వరుసగా క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. కువైట్‌లో ఆయుధ నిల్వ కేంద్రం, గగనతల రక్షణ వ్యవస్థను ధ్వంసం చేసినట్టు ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ తెలిపింది. అహ్వాజ్ ప్రాంతంలో అమెరికా ఎంక్యూ9 రీపర్ డ్రోన్‌ను కూల్చివేశామని పేర్కొంది.

## ట్రంప్ పోస్టులకు నెలకు రూ. 96 లక్షలు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సొంత సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో చేసే పోస్టులకు ఆ కంపెనీ ధరలను ప్రకటించింది. ట్రూత్ సోషల్ యాప్‌లో యూజర్లకు కనిపించటానికి ముందే ఆ పోస్టులను తెలుసుకోవాలనుకునే వారు నెలకు లక్ష డాలర్లు (దాదాపు రూ.96 లక్షలు) చెల్లించాల్సి ఉంటుందని కంపెనీ ఆదివారం ప్రకటించింది. ట్రంప్‌తోపాటు ట్రూత్ సోషల్‌లో అత్యధిక ఫాలోవర్లు ఉన్న టాప్ 10 మంది ప్రముఖుల పోస్టులను ముందుగానే పొందాలంటే.. ఆ ప్రముఖుల స్థాయిని బట్టి నెలకు 60 వేల డాలర్ల నుంచి లక్ష డాలర్ల వరకు చెల్లించి ట్రూత్ ఏపీఐ సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుందని కంపెనీ తాత్కాలిక సీఈవో కెవిన్ మెక్‌గర్న్ ప్రకటించారు. స్టాక్‌మార్కెట్ ట్రేడింగ్ కంపెనీలు, బ్యాంకులు, హెడ్జ్ ఫండ్ కంపెనీలతోపాటు వ్యక్తులు కూడా ఈ సబ్‌స్క్రిప్షన్ తీసుకోవచ్చని చెప్పారు. ట్రూత్ సోషల్‌లో అత్యధిక మంది ఫాలోవర్లు ఉన్నది ట్రంప్‌కే. ఆయనను కోటీ 29 లక్షల మంది ఫాలో అవుతున్నారు. విశేషం ఏమిటంటే ఈ ప్లాట్‌ఫామ్‌పై అత్యధిక ఫాలోవర్లు ఉన్న టాప్ ఐదుగురిలో ట్రంప్ కుటుంబ సభ్యులే ముగ్గురు ఉన్నారు. మరోవైపు ట్రూత్ సోషల్ ఏపీఐతో ట్రంప్ కుటుంబానికే ప్రయోజనాలు ఉంటాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## నాలుగో బిడ్డకు జన్మనిచ్చిన

# ఉషా వాన్స్



అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ శుభవార్త పంచుకున్నారు. ఆయన సతీమణి ఉషా వాన్స్ ఆదివారం ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) పండంటి మగబిడ్డకు జన్మనిచ్చినట్లు తెలిపారు. అతనికి అలెక్ నీల్ వాన్స్ అని పేరు పెట్టామని చెప్పారు. తల్లి, బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారంటూ జేడీ వాన్స్ తన ప్రకటనలో పేర్కొన్నారు. తమ ముగ్గురు పిల్లలు తమ్ముడిని చూసి ఎంతో సంతోషిస్తున్నారని తెలిపారు.2014లో ఉష, జేడీ వాన్స్ వివాహం చేసుకున్నారు. వీరికి ఇప్పటికే ఇద్దరు కుమారులు ఇవాన్ (9ఏళ్లు), వివేక్ (6ఏళ్లు), కుమార్తె మిరాబెల్ (4ఏళ్లు) ఉన్నారు. ఇప్పుడు నాలుగో సంతానానికి జన్మనిచ్చారు. ఉషా వాన్స్ తెలుగు మూలాలున్న వ్యక్తి అన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తమ చిన్న కుమారుడి పేరులో 'నీల్' అని చేర్చడం ఆసక్తికరంగా మారింది.కాగా.. పదవిలో ఉండగా అమెరికా ఉపాధ్యక్షుడి కుటుంబంలో చిన్నారి జన్మించడం 156 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. అంతకుముందు 1870లో నాటి ఉపాధ్యక్షుడు కోల్‌ఫాక్స్ పదవిలో ఉండగా.. ఆయన భార్య ఎల్లెన్ మగ బిడ్డకు జన్మనిచ్చారు.

# జర్నలిస్టుల జేబులకు చిల్లు

## ఆర్టీసీ రాయితీ మాయాజాలం

- 1/3 రాయితీకి మంగళం.. సగం ధరకంటే ఎక్కువే వసూలు
- ఎక్స్‌ప్రెస్‌లో 55శాతం, ఎలక్ట్రిక్ బస్సుల్లో 60శాతం బాదుడు
- బస్సు పాస్‌లో ఒకటి.. టికెట్ మిషన్‌లో మరొకటి !
- సాఫ్ట్‌వేర్ సాకుతో అదనపు వసూళ్లు.. బెంబేలెత్తుతున్న విలేకరులు



**హైదరాబాద్, జూలై 20, రాజముద్ర న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం, సమాజ హితం కోసం అహర్నిశలు శ్రమించే జర్నలిస్టులకి ఆర్టీసీ షాక్ ఇస్తోంది. జర్నలిస్టులకు ఇచ్చే ప్రయాణ రాయితీల్లో నిశ్శబ్దంగా కోత విధిస్తూ, వారిపై అదనపు భారాలు మోపుతోంది. గతంలో అమలైన 1/3 (మూడో వంతు) రాయితీని కాగితాలకే పరిమితం చేస్తూ, క్షేత్రస్థాయిలో సగం కంటే ఎక్కువ ధరను వసూలు చేస్తుండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టేట్ అక్రిడిటేషన్ నిబంధనల ప్రకారం జర్నలిస్టులకు టికెట్ ధరలో కేవలం 33 నుండి 35 శాతం మాత్రమే వసూలు చేయాలి. కానీ, ప్రస్తుతం ఆర్టీసీ దాదాపు 50 శాతం (1/2 ధర) కంటే ఎక్కువే వసూలు చేస్తోంది. బస్సు పాస్‌ల మీద స్పష్టంగా 1/3 రాయితీ అని ముద్రిస్తున్న అధికారులు, టికెట్ ఇష్యూయింగ్ మిషన్లలో (టిమ్స్) మాత్రం ఆ మేరకు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయకపోవడమే ఈ దోపిడీకి కారణమని తెలుస్తోంది.

**ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ బస్సుల్లో చుక్కలు....**

సాధారణ పల్లె వెలుగు బస్సుల కంటే ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ సర్వీసుల్లో జర్నలిస్టులకు రాయితీ భారం భారంగా మారింది. ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో వీటిలో జర్నలిస్టుల నుంచి ఏకంగా 53 శాతం నుండి 55 శాతం వరకు టికెట్ ధర వసూలు చేస్తున్నారు. అంటే రాయితీ 50 శాతం కూడా ఉండటం లేదు. ఎలక్ట్రిక్ బస్సుల్లో పర్యావరణ హితం పేరిట వచ్చిన ఈ బస్సుల్లో జర్నలిస్టులకు అసలైన షాక్ తగులుతోంది. ఇక్కడ ఏకంగా 60 శాతం ధర వసూలు చేస్తూ, కేవలం 40 శాతం రాయితీతోనే సరిపెడుతున్నారు.

**కండక్టర్లతో వాగ్వివాదాలు.. మిషన్లదే తప్పు!**

బస్సుల్లో రాయితీపై కండక్టర్లను ప్రశ్నిస్తే.. మేమేం చేయలేం.. మిషన్లలో (టిమ్స్) ఫీడింగ్ ఎలా ఉంటే అలాగే టికెట్ వస్తుందని వారు చేతులెత్తేస్తున్నారు. రాయితీ లెక్కల్లో స్పష్టత లేకపోవడంతో నిరంతరం జర్నలిస్టులకు, కండక్టర్లకు మధ్య వాగ్వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. దూరాన్ని బట్టి లెక్కించాల్సిన రాయితీలు అస్తవ్యస్తంగా మారుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వార్తల సేకరణ కోసం జిల్లా కేంద్రాలకు, ఇతర పట్టణాలకు నిరంతరం ప్రయాణించే విలేకరులకు ఈ టికెట్ భారం గుదిబండగా మారింది. అతి తక్కువ జీతాలతో పని చేసే జర్నలిస్టులు, తమ సంపాదనలో ఎక్కువ భాగం ప్రయాణాలకే వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**జర్నలిస్టు సంఘాల డిమాండ్..**

ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే స్పందించి అన్ని రకాల బస్సుల్లో (ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ సహా) పాత పద్ధతిలో మూడోవంతు రాయితీని పక్కాగా అమలు చేయాలని జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. యూజర్ చార్జీల నుంచి జర్నలిస్టులకు మినహాయింపు ఇవ్వాలని, టికెట్ మిషన్లలో సాఫ్ట్‌వేర్ లోపాలను సరిదిద్దాలని కోరుతున్నాయి. ప్రభుత్వ పెద్దలు స్పందించి ఈ రాయితీ కోతకు అడ్డుకట్ట వేయాలని జర్నలిస్టులు కోరుతున్నారు.

## అపరమేధావి డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తికి పీవీ ఎక్సలెన్స్ అవార్డు

- హైదరాబాద్‌లో ఘన సన్మానం
- ఇప్పటివరకు 78 అవార్డులు, 142 సన్మానాలు అందుకున్నట్లు వెల్లడి



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపరమేధావి డాక్టర్ గుగ్గిళ్ళ దివ్యమూర్తి కి మరో అరుదైన గౌరవం దక్కింది.దివ్యమూర్తి ప్రతిభను గుర్తించి "పీవీ నరసింహారావు ఎక్సలెన్స్ అవార్డు" ను కళానిలయం కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ వారు ప్రదానం చేశారు. ఈ అవార్డు ప్రదానోత్సవం హైదరాబాద్ అబిడ్స్, బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ లో ఉన్న డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరం లో జరిగింది. రామేశ్వరరాజు చేతుల మీదుగా డా. గుగ్గిళ్ళ దివ్యమూర్తి ఈ అవార్డును అందుకున్నారు. అనంతరం ప్రముఖులు దివ్యమూర్తిని శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా డా.గుగ్గిళ్ళ దివ్యమూర్తి మాట్లాడుతూ "ఈ అవార్డు రావడం, సన్మానం జరగడం ఎంతో సంతోషంగా ఉంది. ఇప్పటివరకు నాకు 78 అవార్డులు వచ్చాయి. 142 వేదికల మీద సన్మానం జరిగింది. సమాజ సేవ, విద్యా రంగంలో మరింత కృషి చేస్తాను" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడ్లూరి నరసింహమూర్తి, సంస్థ అధ్యక్షులు పుష్పాలత, సంస్థ సెక్రెటరీ సురేందర్, దుర్గాభవాని, చందు ఆంజనేయులు, రఫీ అహ్మద్ తదితరులు పాల్గొని దివ్యమూర్తిని అభినందించారు.ఖమ్మం జిల్లాకు చెందిన వ్యక్తికి ఇంతటి గౌరవం దక్కడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అక్రమ సెల్లార్లు ఇక్కడ... అధికారులు ఎక్కడ..?







- జేబులు నింపుకోవడంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది బిజీ !
- కూకట్పల్లిలో రెచ్చిపోతున్న బిల్డర్లు..

**కూకట్‌పల్లి, రాజముద్ర న్యూస్ :** కూకట్‌పల్లి పరిధిలో అక్రమ నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న సెల్లార్ల తవ్వకాలు పరాకాష్టకు చేరాయి. "అక్రమ సెల్లార్లు ఇక్కడ... అధికారులు ఎక్కడ..?" అని స్థానిక ప్రజలు ముక్కున వేలేసుకునేలా పరిస్థితి తయారైంది. భవన నిర్మాణ నిబంధనలను బొందపెడుతూ, ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించకుండా పదుల అడుగుల లోతుకు గుంతలు తవ్వుతున్నా పట్టించుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం మౌనముద్ర దాల్చారు.

**కే పి హెచ్ బి లో రెచ్చిపోతున్న బిల్డర్లు!**

వాణిజ్య, నివాస ప్రాంతాలనే తేడా లేకుండా కూకట్‌పల్లిలో అక్రమ బిల్డర్లు చెలరేగిపోతున్నారు. అధికారుల అండదండలు ఉన్నాయన్న ధీమాతో అనుమతులకు మించిన లోతులో సెల్లార్ గుంతలు తీస్తూ పక్క భవనాల పునాదులను, స్థానికుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టేస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ రిటైనింగ్ వాల్స్ నిర్మించకుండానే తవ్వకాలు జరపడం వల్ల వర్షాలు పడితే పక్కన ఉన్న నిర్మాణాలు కూలిపోయే ముప్పు ఉంది. భారీ యంత్రాలతో రాత్రింబవళ్లు తవ్వుతుంటే చుట్టుపక్కల భవనాల ప్రహరీ గోడలు, పునాదులు లూజ్ అయిపోతున్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

**జేబులు నింపుకోవడంలో బిజీగా ఉన్నారా..?**

భారీ యంత్రాల శబ్దాలు కే పి హెచ్ బి కాలనీ, గోపాల్ నగర్ వీధుల్లో మార్మోగుతున్నా అధికారులకు వినపడకపోవడం వెనుక అసలు కథ వేరే ఉందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలను పర్యవేక్షించాల్సిన అధికారులు తమ బాధ్యతలను విస్మరించి, దర్జాగా జేబులు నింపుకోవడంలో బిజీగా ఉన్నారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ బిల్డర్లతో అధికారులు కలిసిపోయారా..! సామాన్యుడు చిన్న ఇల్లు కట్టుకుంటే వాలిపోయే టౌన్ ప్లానింగ్ సిబ్బంది, కూకట్‌పల్లిలో టన్నుల కొద్దీ మట్టిని తోడుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?

**అక్రమ బిల్డర్లతో అధికారులు కలిసిపోయారా..?**

బిల్డర్లు, టౌన్ ప్లానింగ్ అధికారుల మధ్య నడుస్తున్న "అపవిత్ర కలయిక" వల్లే కూకట్‌పల్లిలో అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయని స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ప్రతి సెల్లార్ గుంత వెనుక లక్షలాది రూపాయల మామూళ్లు చేతులు మారుతున్నాయన్న వార్తలు వినిపిస్తున్నాయి.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిద్రమత్తు వదిలి, కూకట్‌పల్లిలో రెచ్చిపోతున్న అక్రమ బిల్డర్లపై మరియు వారికి సహకరిస్తూ జేబులు నింపుకుంటున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, తక్షణమే ఆ సెల్లార్ పనులను నిలిపివేసి భద్రతా చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఎల్‌నినో ప్రభావం పంటల వైవిధ్యీకరణపై అవగాహన

**ఏఈఓ రాకేష్**



**రామారెడ్డి, రాజముద్ర, న్యూస్:** రామారెడ్డి మండలంలోని ఇస్సన్నపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎల్‌నినో ప్రభావం, పంటల వైవిధ్యీకరణ పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులకు ఎల్‌నినో కారణంగా వర్షపాతం తగ్గే అవకాశం, పంటలపై దాని ప్రభావం, నీటి వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ పంటల సాగు, సమతుల్య ఎరువుల వినియోగం, సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై వివరించడం జరిగింది. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకొని, వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలని రైతులకు సూచించారు.ప్రస్తుతం కంది, పెసర, మినుము, ఆముదం, పొద్దు తిరుగుడు , సజ్జలు, రాగులు, వేసుకోవాలి అని సూచించడం జరిగింది. తక్కువ నీటి వసతి ఉన్న పంటలను పండించి దిగుబడులు సాధించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ దోకి లచ్చయ్య, ఉపసర్పంచ్ రమేష్ , జిపిఓ స్వామి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

**ఉపసర్పంచ్ నవీన్**



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం ఉపసర్పంచ్ హనుమాయల నవీన్ బిఎల్ఓ లతో సమీక్షా చేసి. ఎస్ఐఆర్ ప్రక్రియలోని పురోగతిపై పర్సంటేజ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు.బిఎల్ఓ లు సమాధానం ఇస్తూ ఇప్పటివరకు గ్రామంలో 80% వరకు నమోదు పూర్తయిందని, మిగిలిన 20% కూడా త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గ్రామంలో లేని వారి వివరాలను వారి బంధువుల వద్ద ఫోన్ నంబర్లు సేకరించి,ఎస్ఐఆర్ గురించి తెలియజేసి వివరాలు సేకరించి నమోదు చేస్తున్నామని పేర్కొన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశిత సమయంలోగా 100% పూర్తి చేయాలని,ఎలాంటి పేర్లు విడిచిపెట్టకుండా అందరి వివరాలు నమోదు చేయాలని ఉపసర్పంచ్ నవీన్ బిఎల్ఓ లకు సూచించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో బిఎల్ఓలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆరోగ్యకర గ్రామం కోసం పారిశుధ్య కార్యక్రమం



**రాజముద్ర న్యూస్, జైనూర్:** ఆరోగ్యకర గ్రామం కోసం పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు జంగం గ్రామ సర్పంచ్ పెందూర్ అనుసయా అర్జున్ అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సోమవారం ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ ఆధ్వర్యంలో గ్రామంలోని కాలువల్లో పేరుకుపోయిన చెత్త, మురుగును తొలగించే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పేందుకు గ్రామపంచాయతీ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. గ్రామస్తులు కూడా చెత్తను కాలువల్లో వేయకుండా పరిశుభ్రతను కాపాడేందుకు సహకరించాలని కోరారు. పరిశుభ్రమైన గ్రామం.. ఆరోగ్యకరమైన గ్రామంఅనే లక్ష్యంతో ఇలాంటి పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. గ్రామాభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని ఈ సందర్భంగా గ్రామస్తులు పేర్కొన్నారు.

# బెల్ట్ షాపులపై రామాయంపేట పోలీసుల కొరడా..

- 22 లీటర్ల మద్యం స్వాధీనం.
- అక్రమ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ బాలరాజు హెచ్చరిక.



**రాజముద్ర న్యూస్, రామాయంపేట:**
రామాయంపేట మండలంలోని దంతేపల్లి గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపుపై పోలీసులు ఆదివారం రాత్రి ఆకస్మిక దాడి నిర్వహించారు. గ్రామంలో ఓ ఇంటి నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు రామాయంపేట ఎస్ఐ బాలరాజు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు.దాడిలో సుమారు 22 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు, సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్ఐ బాలరాజు మాట్లాడుతూ, గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించడం చట్టవిరుద్ధమని, అక్రమ మద్యం విక్రయాలు, నిల్వలు, రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సోనమ్ వాంగ్ చుక్ చేపట్టిన దీక్షా కు అండగా నిరసన

- కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని: మాల సంఘం డిమాండ్
- ఘనంగా అంబేద్కర్ జ్ఞాన మాల నిర్వహణ



**రాజముద్ర న్యూస్, కీసర :**
పర్యావరణ, విద్యావేత్త సోనం వాంగ్ చుక్ గత 21 రోజులుగా చేస్తున్న నిరాహార దీక్ష కు అండగా నిలుద్దాం అని జాతీయ మాల మహానాడు సంఘం మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అధ్యక్షుడు గుజ్జుక పరుశురాం శనివారం పిలుపునిచ్చారు.ఆయన పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆదివారం దమ్మాయిగూడ డివిజన్ ఆర్జీకే కాలనీలోని చైతన్యభూమి అంబేద్కర్ విగ్రహం వద్ద మాల సంఘం ఆధ్వర్యంలో జ్ఞానమాల కార్యక్రమం అనంతరం నిరసన తెలిపిన సంఘం నేతలు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడువారాలుగా ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద సిజేపి తో కలిసి నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు, టెక్నికల్, పేపర్ లీకేజీల పై కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రముఖ పర్యావరణ, విద్యావేత్త సోనమ్ వాంగ్ చుక్ చేపట్టిన నిరహార దీక్షను శనివారం అర్ధ రాత్రి పోలీసులు వచ్చి ఆయనను హాస్పిటల్ కు తరలించడం.. కేంద్ర ప్రభుత్వం నిరాహార దీక్ష ను చెడగొట్టే కుట్రేనని, దీనిని వ్యతిరేకిస్తూ సోనం వాంగ్ చుక్ కు దేశంలోని యువత, ప్రజలు అండగా నిలబడాలని జిల్లా వ్యాప్తంగా విద్యార్థి, యువత, వారి తల్లిదండ్రులను పరుశురాం కోరారు. ఆయన దీక్షా ను భగ్నం చేసే కుట్రలో బాగంగా దేశావ్యాప్తంగా వివిధ రంగాలలో పని చేస్తున్న నిపుణులు, ప్రజలు, విద్యావేత్తలు, యువత తీవ్ర ఆందోళనలకు గురౌతున్న క్రమంలో వెంటనే కేంద్ర ప్రభుత్వం పరీక్షల అవకతవకలులో జరిగిన తప్పిదాలకు జవాబుదారితనానికి విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు ఒప్పించేలా చేయాలని, లేదా ప్రధాని నరేంద్రమోడీ, అమిత్ షా లు ధర్మేంద్ర ను మంత్రి పదవినుండి భర్తరఫ్ చేసి, సోనమ్ వాంగ్ చుక్ కు ఎలాంటి ప్రాణహాని జరుగకుండా చూడాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల మంచి భవిష్యత్ కొరకు విద్యావ్యవస్థలో పారదర్శకమైన జవాబుదారీ తనాన్ని కోరుతున్న సోనమ్ వాంగ్ చుక్ డిమాండ్ న్యాయమైనది, ప్రజాస్వామికమైనదని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ వైఖరిని నిరసిస్తూ మాల సంఘం నేతలు చేసిన నినాదాలతో అంబేద్కర్ ప్రాంగణం (చైతన్య భూమి) దద్దరిల్లింది. కార్యక్రమంలో అర్జికే కాలనీ మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కోలాటి రాజు, ముఖ్యసలహా దారులు, అబ్బులు, యాటా రాజు, రాజేంద్ర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గౌతమ్, కోశాధికారి పాడుగుల రూప చంద్రమౌళి, ఈశ్వరి, సీనియర్ నాయకులు చెన్నయ్య, చంద్రమౌళి, సాయి బాబా, జయమయ్య, కనకరాజు, వినాయక రావు, వెంకటేశ్వర రావు, మనోజు, ప్రవీణ్, అప్పారావు, జనార్దన్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జ్ సిగ్గుచేటు

- కాకతీయ యూనివర్సిటీలో మోడీ దిష్టిబొమ్మ దగ్ధం
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి
- పేపర్ లీకేజీ మాఫియాకు కేంద్ర ప్రభుత్వం వత్తాసు పలకడం సిగ్గుచేటు
- పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారావు




**రాజముద్ర న్యూస్, హన్మకొండ:**
నీట్ పేపర్ లీకేజీ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, సామాజిక వేత్త సోనమ్ వాంగ్‌చుక్ పిలుపులో భాగంగా ప్రజాస్వామ్య పద్ధతిలో 'ఛలో పార్లమెంట్'కు బయలుదేరిన విద్యార్థులు, యువతపై కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జి చేసి భాష్పవాయువు ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారావు, వరంగల్-హన్మకొండ జిల్లాల అధ్యక్షులు బోయినపల్లి అజయ్ అన్నారు. సోమవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గత 20 రోజులుగా నిరాహార దీక్ష, ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి యువతపై కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్ ఘటన వల్ల ప్రాణాలు కోల్పోయిన 20 మంది విద్యార్థుల కుటుంబాలకు తక్షణమే న్యాయం చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను తక్షణమే మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే వారి డిమాండ్లపై చర్చించకుండా, బలవంతంగా పోలీసులతో దీక్షను విరమింపజేయడం కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక, ఫాసిస్టు వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి దేశంలో 84 కంటే ఎక్కువ పరీక్షల పేపర్ లీక్ ఘటనలు చోటు చేసుకున్నాయని, విద్యా వ్యవస్థను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిపై దేశద్రోహుల ముద్ర వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్న కేంద్ర ప్రభుత్వానికి సంఘటిత ఉద్యమాలతో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తూ, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడిని మేధావులు, ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, కోశాధికారి కే. సంగీత, అశోక్, కాకతీయ యూనివర్సిటీ నాయకులు అనిల్, సద్దాం, డోనాల్డ్, సరిత, వినయ్, గణేష్, కార్తీక్, రాజ్ కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు





- పాఠశాల ఆవరణలో గడ్డి మందు పిచికారీ

**రాజముద్ర న్యూస్, జైనూర్:**
విద్యార్థుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ పెందూర్ అనుసయా అర్జున్, ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ అన్నారు. సోమవారం మండలంలోని జంగాం ఉర్దూ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గడ్డి మందు పిచికారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పాఠశాల ప్రాంగణంలో కలుపు మొక్కలు, గడ్డి అధికంగా పెరగడంతో దోమలు, విషపురుగులు పెరిగే అవకాశం ఉందని గుర్తించి ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో పాఠశాల పరిసరాల్లో గడ్డి మందు పిచికారీ చేయడం జరిగిందని వివరించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రామ ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచి దోమలు, విషపురుగులు పెరగకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మహేబూబ్ ఆజం, గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డును తరలించాలనేది ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి డిమాండ్

- ముఖ్య అతిథిగా విచ్చేసి, స్పష్టం చేసిన మాజీ మేయర్ మేకల కావ్య.
- బాషవోని కొండల్ ముదిరాజ్ అధ్యక్షతన డంపింగ్ యార్డు ఎత్తివేయాలని జరుగుతున్న పదవరోజు పాదయాత్ర.

**రాజముద్ర న్యూస్, జవహర్ నగర్ :**
జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటి ఆధ్వర్యంలో గత పదిరోజులుగా శాంతినగర్, గబ్బిలాలపేట, రాజీవ్ గాంధీ నగర్, బాగ్యనగర్, ప్రగతినగర్, బిజేఆర్ నగర్, బండ్లగూడ, శివాజీనగర్ తదితర బస్తీలలో 26 న డంపింగ్ యార్డు సమస్యపై జరిగే సన్నాహక అవగాహన సదస్సులో బాగంగా 2026, జూలై-20, సోమవారం రోజు, బాలాజీనగర్, ఫైరింగ్ రేంజ్ నుండి జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ డాక్టర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల వరకు కమిటీ కో కన్వీనర్ మరియు బీఆర్ఎస్ జవహర్ నగర్ అధ్యక్షుడు బాషవోని కొండల్ ముదిరాజ్ అధ్యక్షతన బారీ పాదయాత్ర జరిగింది. డంపింగ్ యార్డు ప్రజల ఆరోగ్యానికి పర్యావరణానికి పెద్దముప్పుగా తయారయిన డంపింగ్ యార్డును పూర్తిగా తొలగించాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి గత ఆరునెలలుగా కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ నేత మరియు మాజీ మేయర్ మేకల కావ్య స్పష్టం చేశారు. స్థానిక ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఉచిత మంచినీరు, ఆస్తిపన్ను మాఫీ చేసి, చెత్తలారీల వలన దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీలు, లైట్లు, వేయించాలని అసెంబ్లీలో మల్లారెడ్డి ప్రస్తావించారని గుర్తుచేశారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటి అండగా బీఆర్ఎస్ ఉంటుందని పేర్కొన్నారు. ఈపై కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల చైర్మన్ శోభా, మాజీ ప్రజాప్రతినిధులు జిట్టా శ్రీనివాస్, పల్లపురవి, రామస్వామి యాదవ్, ఎం.డి.హైమద్, బండకింది సింగరాయ ప్రసాద్, చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్, కో కన్వీనర్స్ సిపిఎం శివన్నారాయణ, సిపిఐ తోటపల్లి శంకర్, సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ అనురాధ, సిపిఐ(ఎం.ఎల్)మాస్ లైన్ గడ్డం సదానందం, ఇఫ్టూ పి.శివబాబు, ఏ.ఐ.ఎఫ్.టి.యు. వై మల్లేష్, సిఎంఎస్ జయ, అల్లూరి సావిత్రి, బి.ఎన్.ఆర్.కె.ఎస్. సూర వెంకటయ్య, ఇఫ్టూ అరుణ, ముస్లిం కమిటీ టి.కాలేషా, పిడిఎం చంద్రమౌళి, పికెఎం జాన్, టియుసిఐ వి.ప్రవీణ్, పిఓడబ్ల్యూ(విముక్తి) పెర్క సునిత, పిఓడబ్ల్యూ డి.స్వరూప, లక్ష్మీబాయి, జయసుధ, ఫాతిమా, అంబాల ఎల్లయ్య, టివిఐవి మబ్బుబాలు, దుర్గాప్రసాద్ మరియు బీఆర్ఎస్ కు చెందిన శ్రేణులు పెద్ద ఎత్తున పాదయాత్రలో పాల్గొన్నారు.

# బుల్కాపూర్ నాలా ఆక్రమణ..అధికారుల మామూళ్ల పర్వం?

**రాజముద్ర న్యూస్, రాజేంద్రనగర్:**
ఒకవైపు ఆక్రమణదారుల గుండెల్లో 'హైడ్రా' భయం పుట్టిస్తుంటే... మరోవైపు క్షేత్రస్థాయి అధికారుల అండతో అక్రమార్కులు ఏకంగా నాలాలనే మింగేస్తున్నారు. నార్సింగి మున్సిపల్ సర్కిల్ పరిధిలోని మణికొండ డివిజన్‌లో ఉన్న చారిత్రాత్మక బుల్కాపూర్ నాలాను మూసివేస్తూ ఒక బడా నిర్మాణ సంస్థ కాంక్రీట్ ప్రహారీ గోడ కడుతుండటం కలకలం రేపుతోంది.కళ్ల ముందే నాలా మాయం.. అధికారుల మౌనం వెనుక మర్మమేంటి?మణికొండలోని ప్రసిద్ధ బీరప్ప ఆలయం సమీపంలో ఈ అక్రమ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. వర్షాకాలంలో వరద నీరు సాఫీగా వెళ్లేందుకు కీలకమైన బుల్కాపూర్ నాలాను మట్టితో పూడ్చేసి, దాని విస్తీర్ణాన్ని కుదించేస్తూ నిర్మాణ సంస్థ ప్రహారీ గోడ లేపుతోంది.ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు కనీసం స్పందించకపోవడం వెనుక భారీగా 'మామూళ్లు' వసూళ్ళు చేశారు అని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక నాయకులు, అధికారులు చేతులు కలిపి దండుకోవడంతోనే ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మున్సిపల్ చర్యలు శూన్యం – ముంపు భయంలో మణికొండ!హైదరాబాద్ వ్యాప్తంగా చెరువులు, నాలాల పరిరక్షణకు హైడ్రా ఉక్కుపాదం మోపుతుంటే, క్షేత్రస్థాయి అధికారులు మాత్రం ఆక్రమణదారులకు కొమ్ముకాస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.ముంపు ముప్పు: చారిత్రాత్మక గొలుసుకట్టు నాలా వ్యవస్థను ధ్వంసం చేయడం వల్ల రాబోయే వర్షాలకు మణికొండతో పాటు పరిసర ప్రాంతాలు జలమయం అయ్యే ప్రమాదం ఉంది.ఫలితం లేని ఫిర్యాదులు: స్థానిక అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా అవినీతి కూపంలో కూరుకుపోయిన యంత్రాంగం పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజల విజ్ఞప్తి:**

"హైడ్రా కమిషనర్ తక్షణమే స్పందించి, బీరప్ప ఆలయం వద్ద బుల్కాపూర్ నాలాపై నిర్మిస్తున్న అక్రమ ప్రహారీ గోడను కూల్చివేయాలి.

## అన్ని విమర్శలకు రోహిత్ శర్మ సమాధానం ఇదే...
# పాక్ మాజీ క్రికెటర్ ప్రశంసలు

- **ఇంగ్లండ్‌పై రోహిత్ శర్మ సెంచరీ అద్భుతమని కమ్రాన్ అక్మల్ ప్రశంస**
- **తన భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు రోహిత్ బ్యాట్‌తోనే జవాబిచ్చాడని వ్యాఖ్య**
- **రోహిత్, కోహ్లీ ఎప్పుడు రిటైర్ అవ్వాలో వారే నిర్ణయించుకుంటారని పేర్కొన్న అక్మల్**
- **భారత ఓటమికి పేలవమైన బౌలింగే కారణమని విశ్లేషణ**
- **కుల్‌దీప్ యాదవ్‌ను ఆడించకపోవడం జట్టుకు నష్టం చేసిందని అభిప్రాయం**

**స్పోర్ట్స్ డెస్క్ :**

ఇంగ్లండ్‌తో జరిగిన మూడో వన్డేలో టీమిండియా ఓడినా, స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ చేసిన సెంచరీపై పాకిస్థాన్ మాజీ వికెట్ కీపర్ కమ్రాన్ అక్మల్ ప్రశంసల వర్షం కురిపించాడు. రోహిత్ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు, విమర్శలకు ఈ సెంచరీయే సరైన సమాధానమని అభిప్రాయపడ్డాడు. లార్డ్స్‌లో రోహిత్ (138) ఆడిన ఇన్నింగ్స్ ఒక "స్టేట్‌మెంట్ ఇన్నింగ్స్" అని, 50 ఓవర్ల ఫార్మాట్‌లో తానెందుకు అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడో మరోసారి నిరూపించుకున్నాడని అక్మల్ అన్నాడు.

"2027 ప్రపంచకప్ జట్టులో రోహిత్‌కు చోటు దక్కదంటూ వదంతులు వ్యాపించాయి. కానీ, ఈ రోజు తన బ్యాట్‌తోనే వాటన్నింటికీ రోహిత్ సమాధానం చెప్పాడు" అని అక్మల్ ఒక పాడ్‌కాస్ట్‌లో పేర్కొన్నాడు. రోహిత్, విరాట్ కోహ్లీ లాంటి గొప్ప ఆటగాళ్లు ఎప్పుడు తప్పుకోవాలో వారే నిర్ణయించుకుంటారని, ఎవరూ వారిని బయటకు పంపలేరని స్పష్టం చేశాడు. భారత క్రికెట్ కోసం ఎన్నో త్యాగాలు చేసిన వారిని ప్రదర్శన ఆధారంగా అంచనా వేయాలని సూచించాడు.

అయితే, ఈ మ్యాచ్‌లో భారత ఓటమికి పేలవమైన బౌలింగే కారణమని అక్మల్ విశ్లేషించాడు. ప్రసిధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్ వంటి బౌలర్లు భారీగా పరుగులు ఇవ్వడం, స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను ఆడించకపోవడం జట్టును దెబ్బతీసిందని అన్నాడు. "ప్రధాన బౌలర్లే 70 నుంచి 100 పరుగులు ఇస్తే మ్యాచ్ గెలవడం కష్టం. కుల్‌దీప్ ఉండుంటే వికెట్లు తీసి ఫలితాన్ని మార్చేవాడేమో" అని అభిప్రాయపడ్డాడు.ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 387/5 భారీ స్కోరు చేయగా, భారత్ 360/7 వద్ద పరిమితమై 27 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. దీంతో సిరీస్‌ను 21 తేడాతో ఇంగ్లండ్ కైవసం చేసుకుంది.




## అవన్నీ మీడియా సృష్టే.. రోహిత్ రిటైర్మెంట్‌పై కెప్టెన్ గిల్ క్లారిటీ

- **రోహిత్ శర్మ రిటైర్మెంట్‌పై వస్తున్న వార్తలను ఖండించిన టీమిండియా కెప్టెన్**
- **లార్డ్స్‌లో జరిగిన మూడో వన్డే తర్వాత రోహిత్ రిటైర్ అవుతాడంటూ ఊహాగానాలు**
- **ఇదే మ్యాచ్‌లో అద్భుత శతకంతో (138) ఆకట్టుకున్న హిట్‌మ్యాన్**
- **రిటైర్మెంట్‌పై జట్టులో ఎలాంటి చర్చ జరగలేదని గిల్ స్పష్టీకరణ**
- **రోహిత్ అద్భుతమైన ఇన్నింగ్స్‌పై గిల్ ప్రశంసల జల్లు**
- **అతని బ్యాటింగ్ చూడటం ఓ అద్భుతమని కొనియాడిన కెప్టెన్ గిల్**



**స్పోర్ట్స్ డెస్క్ :**

టీమిండియా సీనియర్ ఓపెనర్, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నాడంటూ వస్తున్న వార్తలను ప్రస్తుత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కొట్టిపారేశాడు. ఇంగ్లండ్‌తో లార్డ్స్ వేదికగా జరిగిన మూడో వన్డే తర్వాత రోహిత్ తన 19 ఏళ్ల వన్డే కెరీర్‌కు ముగింపు పలుకుతారని సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, జట్టులో ఈ అంశంపై ఎటువంటి చర్చ జరగలేదని గిల్ స్పష్టం చేశాడు.

ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లోని చివరి వన్డేకు ముందు, రోహిత్ రిటైర్మెంట్‌పై తీవ్రమైన ఊహాగానాలు చెలరేగాయి. అయితే, ఈ వదంతులన్నింటికీ తన బ్యాట్‌తోనే సమాధానమిచ్చిన రోహిత్, ఈ మ్యాచ్‌లో అద్భుతమైన శతకంతో కదం తొక్కాడు. కేవలం 110 బంతుల్లో 17 ఫోర్లు, 5 భారీ సిక్సర్లతో 138 పరుగులు చేసి, తనలో ఇంకా సత్తా తగ్గలేదని నిరూపించుకున్నాడు. దాదాపు ఒంటిచేత్తో జట్టును గెలిపించేంత పనిచేశాడు.

మ్యాచ్ అనంతరం జరిగిన మీడియా సమావేశంలో రోహిత్ భవిష్యత్తు గురించి గిల్‌ను ప్రశ్నించగా.. "ఆయన మాతో అలాంటి విషయం ఏమీ చెప్పలేదు. ఇవన్నీ మీడియాలో వస్తున్న కథనాలేనని నేను భావిస్తున్నాను. జట్టులో ఈ అంశంపై ఎలాంటి చర్చ జరగలేదు" అని స్పష్టత ఇచ్చాడు.

ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ నిర్దేశించిన 387 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భారత్ 27 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఛేదనలో గిల్‌తో కలిసి రోహిత్ తొలి వికెట్‌కు 147 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. ముఖ్యంగా రోహిత్ ఇన్నింగ్స్ తీరును గిల్ ప్రత్యేకంగా ప్రశంసించాడు. "రోహిత్ భాయ్ తన ఇన్నింగ్స్‌ను నడిపించిన విధానం అద్భుతం. చాలా సమయం నేను నాన్‌స్ట్రైకర్ ఎండ్‌లో ఉండి అతని బ్యాటింగ్ చూస్తూ ఉండిపోయాను. ఇంత భారీ లక్ష్యాన్ని ఛేదించాలంటే వికెట్లు చేతిలో ఉంచుకోవడం ఒక్కటే మార్గమని మేమిద్దరం చర్చించుకున్నాం" అని గిల్ వివరించాడు.

"పవర్‌ప్లేలో దూకుడుగా ఆడాలా? వద్దా? అని మాట్లాడుకున్నాం. కానీ, కొత్త బంతితో దాడి చేయడం సులభం కాదని మాకు తెలుసు. రోహిత్ తన ఇన్నింగ్స్‌ను నెమ్మదిగా ప్రారంభించి, ఆ తర్వాత వేగం పెంచిన తీరు అసాధారణం. ఆయన 60, 70 పరుగులు దాటిన తర్వాత ఆడిన విధానం చూడటానికి ఓ విందులా అనిపించింది" అని గిల్ తన ఓపెనింగ్ భాగస్వామిపై ప్రశంసల వర్షం కురిపించాడు. ఒకవేళ రోహిత్ శర్మ తన కెరీర్‌ను కొనసాగిస్తే, వచ్చే ఏడాది జరగనున్న ఐసీసీ ప్రపంచకప్‌నకు ముందు తన సత్తా చాటేందుకు అతనికి చాలా అవకాశాలున్నాయి. రాబోయే ఆరు నెలల్లో భారత జట్టు అనేక వన్డే మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. గిల్ ప్రకటనతో రోహిత్ రిటైర్మెంట్‌పై వస్తున్న ఊహాగానాలకు తెరపడినట్లయింది.

# బయట గోల ఉంటేనే మజా.. నా పని లోపల, వాళ్ల పని బయట: రోహిత్ శర్మ

- **లార్డ్స్‌లో చారిత్రక శతకం బాదిన రోహిత్ శర్మ**
- **తన భవిష్యత్తుపై వస్తున్న విమర్శలను పట్టించుకోనన్న హిట్‌మ్యాన్**
- **ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌ను 2-1 తేడాతో కోల్పోయిన భారత్**
- **అనుభవం లేని బౌలింగ్ విభాగానికి అండగా నిలిచిన కెప్టెన్**
- **కోహ్లీతో భాగస్వామ్యం, రికార్డులపై ఆసక్తికర వ్యాఖ్యలు**

**స్పోర్ట్స్ డెస్క్ :**

ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను భారత్ 21 తేడాతో కోల్పోయినప్పటికీ, టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ తన భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలను గట్టిగా తిప్పికొట్టాడు. లార్డ్స్ వేదికగా జరిగిన నిర్ణయాత్మక మూడో వన్డేలో భారత్ 27 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో రోహిత్ చారిత్రక శతకం (138) సాధించినా, జట్టును గెలిపించలేకపోయాడు. మ్యాచ్ అనంతరం తన కెరీర్‌పై వస్తున్న విమర్శలపై స్పందిస్తూ, బయట జరిగే ప్రచారాన్ని తాను అస్సలు పట్టించుకోనని, జట్టు విజయానికి దోహదపడటమే తన ఏకైక లక్ష్యమని స్పష్టం చేశాడు. ఈ విషయంపై బీసీసీఐ విడుదల చేసిన వీడియోలో రోహిత్ మాట్లాడుతూ.. "నా పని బ్యాట్‌తో దేశానికి, జట్టుకు ప్రాతినిధ్యం వహించడం. నేను అరంగేట్రం చేసినప్పటి నుంచి ఇదే నాకు చెప్పబడింది, అదే నేను చేస్తున్నాను. నేను క్రికెట్‌లోకి వచ్చినప్పటి నుంచి బయట గోల ఉంది. నేను ఆడేంత వరకు ఇది ఇలాగే ఉంటుంది. కాబట్టి దాన్ని నేను పెద్దగా పట్టించుకోను. నేను మైదానంలో ఏం చేస్తున్నాననేదే ముఖ్యం. జట్టు విజయానికి నా వంతు కృషి చేయడానికే ప్రయత్నిస్తాను. ప్రస్తుతం నా దృష్టంతా దానిపైనే ఉంది. బయట గోల లేకపోతే అసలు మజానే ఉండదు. నా పని మైదానం లోపల, వారి పని బయట. నేను ఇలాగే చూస్తాను" అని తనదైన శైలిలో బదులిచ్చాడు.




లార్డ్స్‌లో వన్డే శతకం సాధించిన తొలి భారత బ్యాటర్‌గా రికార్డు సృష్టించినప్పటికీ, జట్టు ఓటమి చెందడంతో తీవ్ర నిరాశకు గురైనట్లు రోహిత్ అంగీకరించాడు. "ఫలితం కొంచెం నిరాశపరిచింది. మేము మంచి క్రికెట్ ఆడుతున్నామని భావించాను. బర్మింగ్‌హామ్‌లో అద్భుతంగా ఆడాం. కార్డిఫ్‌లో బ్యాటింగ్‌లో వెనుకబడ్డాం. ఇక లార్డ్స్‌లో భారీ లక్ష్యాన్ని ఛేదించాల్సి వచ్చింది. బ్యాటింగ్‌తో మేము చేయగలిగినదంతా ప్రయత్నించాం, కానీ 2025 పరుగుల తేడాతో ఓడిపోయాం" అని విశ్లేషించాడు.

భారత బౌలింగ్ విభాగం గురించి మాట్లాడుతూ, బౌలర్లకు అంతర్జాతీయ వన్డే అనుభవం తక్కువగా ఉందని, వారికి కొంత సమయం ఇవ్వాలని కోరాడు. ఈ సిరీస్ ఓటమిని ఒక పాఠంగా తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు మెరుగ్గా రాణించాలని ఆశిస్తున్నట్లు తెలిపాడు.

ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీతో తన భాగస్వామ్యంపై కూడా రోహిత్ స్పందించాడు. ఈ జోడీ వన్డేల్లో 21వ శతాధిక భాగస్వామ్యాన్ని నమోదు చేసింది. సచిన్‌గంగూలీ (26) తర్వాత అత్యధిక సెంచరీ భాగస్వామ్యాలు నెలకొల్పిన భారత జోడీగా వీరు నిలిచారు. అలాగే, 400 అంతర్జాతీయ మ్యాచ్‌లు కలిసి ఆడిన తొలి భారత ద్వయంగా రికార్డు సృష్టించారు. కోహ్లీతో కలిసి బ్యాటింగ్ చేయడం ఎప్పుడూ ఆనందాన్ని ఇస్తుందని, ఒకరి ఆటను మరొకరం బాగా అర్థం చేసుకుంటామని రోహిత్ చెప్పాడు.

చివరగా ఇంగ్లండ్‌లో ఆడటాన్ని తాను ఎంతగానో ఇష్టపడతానని రోహిత్ అన్నాడు. ఇక్కడి వాతావరణం, పిచ్‌లు ఆటగాడికి సవాలు విసురుతాయని, అప్పుడే ఆటగాడిగా ఎదుగుతామని పేర్కొన్నాడు. వ్యక్తిగత ప్రదర్శనల కంటే జట్టుగా సమష్టిగా రాణించడం చాలా అవసరమని, ఇకపై దానిపైనే దృష్టి సారిస్తామని రోహిత్ స్పష్టం చేశాడు.

# ‘టికీటాకా 2.0’.. స్పెయిన్ ఆట వెనక అసలు రహస్యం

- **2010లో ‘టికీ-టాకా’ వ్యూహంతో ప్రపంచకప్**
- **బంతిపై ఆధిపత్యమే దీని వెనక లక్ష్యం**
- **2014 తర్వాత వ్యూహంలో మార్పులు**
- **కోచ్ డి లా ఫ్యుయెంటేతో టికీ-టాకా 2.0 ఆవిర్భావం**
- **వేగం, వింగర్లతో మరింత దూకుడు**

**స్పోర్ట్స్ డెస్క్ :**

ప్రపంచ ఫుట్‌బాల్‌లో కొన్ని జట్లు ట్రోఫీలు మాత్రమే గెలుస్తాయి. మరికొన్ని జట్లు ఆటనే మార్చేస్తాయి. స్పెయిన్ రెండో కోవకు చెందిన జట్టు. 2010 ఫిఫా ప్రపంచకప్‌లో ‘టికీటాకా’ వ్యూహంతో ప్రపంచాన్ని మంత్ర ముగ్ధులను చేసిన స్పెయిన్.. ఇప్పుడు అదే శైలికి ఆధునిక రూపం ఇచ్చి ‘టికీటాకా 2.0’తో మరోసారి విశ్వకప్‌ను సొంతం చేసుకుంది. ఒకప్పుడు వందల పాస్‌లతో ప్రత్యర్థులను అలసిపోయేలా చేసిన ఆ జట్టు.. ఇప్పుడు అదే బంతి ఆధిపత్యానికి వేగం, దూకుడు, నేరుగా దాడి చేసే తత్వాన్ని జోడించింది. ఫలితంగా పాత స్పెయిన్ గుర్తుందేలా.. కొత్త ఫుట్‌బాల్‌కు తగ్గట్టుగా ఆడే జట్టుగా అవతరించింది.

**టికీ-టాకా అంటే?**

టికీటాకా అంటే బంతిని ఎక్కువసేపు తమ అధీనంలో ఉంచుకోవడం. ప్రత్యర్థి ఆటగాళ్లను తమవైపు లాగడం. వరుస చిన్న చిన్న పాస్‌లతో ఖాళీ స్థలాలను సృష్టించడం. సరైన సమయం కోసం ఓపిగ్గా ఎదురుచూడడం ఈ శైలి ప్రత్యేకత. ప్రత్యర్థికి బంతి దొరక్కుండా చేయడమే మొదటి లక్ష్యం. అవకాశం వచ్చిన క్షణంలోనే గోల్ అవకాశాన్ని సృష్టించడం రెండో లక్ష్యం.

**కొత్త నిర్వచనం**

దక్షిణాఫ్రికాలో జరిగిన 2010 ప్రపంచకప్‌లో స్పెయిన్ ఆటను ప్రపంచం ఆశ్చర్యంగా చూసింది. బంతి ఎక్కువసేపు తమవద్దే ఉంచుకుంటూ ప్రత్యర్థులను పరుగులు పెట్టించింది. ఏడు మ్యాచుల్లో కేవలం ఎనిమిది గోల్స్ మాత్రమే చేసినా.. ఒక్కో మ్యాచ్‌ను పూర్తిగా తమ నియంత్రణలో ఉంచుకోగలిగింది. 2008 యూరో నుంచి 2012 యూరో వరకు స్పెయిన్ ఆధిపత్యానికి టికీటాకానే ప్రధాన కారణం. బంతి లేకుండా ప్రత్యర్థి ఏమీ చేయలేని పరిస్థితిని సృష్టించడం ఆ జట్టు గొప్పతనం.

**ఎందుకు మారాల్సి వచ్చింది?**

కాలం మారింది. ఫుట్‌బాల్ వేగం పెరిగింది. ప్రత్యర్థి జట్లు కూడా టికీటాకాకు ఎదురుదాడి చేసే వ్యూహాలు సిద్ధం చేసుకున్నాయి. 2014 ప్రపంచకప్‌లో స్పెయిన్ ఘోరంగా విఫలమైంది. 2022 ఖతార్ ప్రపంచకప్‌లో అప్పటి స్పెయిన్ కోచ్ లూయిస్ ఎన్‌రికే కూడా పాత శైలిని కొనసాగించినా ఆశించిన ఫలితం రాలేదు. ఎక్కువసేపు బంతిని తమవద్ద ఉంచుకోగలిగినా.. గోల్స్‌గా మార్చలేకపోవడం పెద్ద సమస్యగా మారింది.

**అక్కడే పుట్టింది టికీ-టాకా 2.0**

జట్టు కోచ్ బాధ్యతలు చేపట్టిన లూయిస్ డీ లా ఫ్యుయెంటే పాత టికీటాకాను పూర్తిగా పక్కన పెట్టలేదు. దానికి కొత్త ఆలోచనలను జోడించాడు. బంతిని తమ అధీనంలో ఉంచే తత్వాన్ని కొనసాగిస్తూనే.. అవసరమైనప్పుడు వేగంగా ముందుకు వెళ్లడం, తక్కువ పాస్‌లతోనే ప్రమాదకర దాడులు చేయడం, వింగర్లను ప్రధాన ఆయుధంగా మార్చడం, బాక్స్‌లో ఎక్కువ మంది ఆటగాళ్లను పంపించడం వంటి మార్పులు చేశాడు.



దీంతో స్పెయిన్ ఆట మరింత దూకుడుగా మారింది. పాస్‌ల కోసం పాస్‌లు కాకుండా.. ప్రతి పాస్‌కు గోల్ లక్ష్యంగా ఉండేలా వ్యూహాన్ని రూపొందించాడు. మైదానం ఇరువైపుల నుంచి వేగంగా దాడులు చేయడం, మధ్యలో ఖాళీలు సృష్టించి ప్రత్యర్థి రక్షణను ఛేదించడం, వెనుక వరుస ఆటగాళ్లను కూడా దాడిలో భాగం చేయడం టికీటాకా 2.0 ప్రత్యేకతగా నిలిచింది.

**యూరో-2024లో కొత్త స్పెయిన్**

యూరో2024లో స్పెయిన్ మూడోసారి యూరో ఛాంపియన్‌గా నిలవడం వెనుక టికీటాకా 2.0 కీలక పాత్ర పోషించింది. ఫైనల్లో ఇంగ్లండ్‌పై రెండు గోల్స్ కూడా ఈ కొత్త తత్వానికే అద్దం పట్టాయి. తొలి గోల్‌లో యమాల్ ఇద్దరు డిఫెండర్లను ఆకర్షించి నికో విలియమ్స్‌కు అవకాశం కల్పించాడు. రెండో గోల్‌లో కేవలం ఐదు పాస్‌లతోనే తమ డిఫెన్స్ నుంచి ప్రత్యర్థి గోల్‌ముందు చేరుకుని మ్యాచ్‌ను ముగించారు.

ఇది పాత స్పెయిన్‌తో పోలిస్తే పెద్ద మార్పు. ఒకప్పుడు వందల పాస్‌ల తర్వాత అవకాశం వచ్చేది. ఇప్పుడు సరైన అవకాశం కనిపిస్తే కొన్ని పాస్‌లతోనే దాడి ముగిస్తున్నారు.

**ఇప్పుడూ అదే వ్యూహం**

ప్రపంచకప్‌లోనూ స్పెయిన్ ఇదే శైలిని కొనసాగించింది. బంతిని తమ అధీనంలో ఉంచుకుంటూనే, అవకాశం వచ్చినప్పుడు వేగంగా దాడి చేసింది. బంతి కోల్పోయినా వెంటనే తిరిగి దక్కించుకుంది. వింగర్లతో రెండు వైపులా దాడులు చేస్తూ, రోడ్రీపెడ్రీలతో మధ్య మైదానాన్ని నియంత్రించింది. ఈ ఆటతీరే స్పెయిన్‌కు ప్రపంచకప్‌ను అందించింది.

గణాంకాల పరంగా చూసినా స్పెయిన్ బంతిపై ఆధిపత్యంలోనే కాకుండా.. గోల్ అవకాశాల సృష్టిలోనూ అగ్రస్థానంలో నిలిచింది. పాత టికీటాకాలో కనిపించిన నెమ్మదితనం ఇప్పుడు లేదు. అదే సమయంలో పాస్‌ల కచ్చితత్వం మాత్రం ఏమాత్రం తగ్గలేదు.

**టికీ-టాకా మారలేదు**

చాలామంది టికీటాకా ముగిసిపోయిందని భావించిన సమయంలో స్పెయిన్ దానికి కొత్త జీవం పోసింది. పాత సిద్ధాంతాన్ని పూర్తిగా మార్చకుండా.. ఆధునిక ఫుట్‌బాల్‌కు అనుగుణంగా తీర్చిదిద్దింది. అందుకే దీనిని ఫుట్‌బాల్ విశ్లేషకులు ‘టికీటాకా 2.0’గా అభివర్ణిస్తున్నారు.

# నన్ను విమర్శించారు.. కానీ విధి మావైపే ఉంది

- **ఎక్‌స్ట్రా టైమ్ గోల్‌తో స్పెయిన్‌కు ప్రపంచకప్ అందించిన సబ్‌స్టిట్యూట్ ప్లేయర్ ఫెర్రాన్ టోర్రెస్**
- **స్పెయిన్ విజయం సాధించాలని విధి ముందే రాసి పెట్టి ఉందన్న టోర్రెస్**
- **ఎదురుగా లియోనెల్ మెస్సీ లాంటి దిగ్గజం ఉన్నప్పుడు ఆందోళన కలగడం సహజమేనని వెల్లడి**
- **టోర్నీ పొడుగునా తనపై వచ్చిన విమర్శలకు గోల్‌తోనే సమాధానం చెప్పానని భావోద్వేగం**
- **స్పెయిన్ దేశంలోని 4.7 కోట్ల మంది ప్రజలకు ఈ గోల్ అంకితమని ప్రకటన**

**స్పోర్ట్స్ డెస్క్ :**

ఫిఫా ప్రపంచకప్ 2026 ఫైనల్ మహాసంగ్రామంలో అర్జెంటీనాను మట్టికరిపించి, స్పెయిన్‌ను విశ్వవిజేతగా నిలిపిన హీరో ఫెర్రాన్ టోర్రెస్ మ్యాచ్ అనంతరం సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఆదివారం జరిగిన భీకర పోరులో 10 మందితో ఆడిన అర్జెంటీనాపై ఎక్‌స్ట్రా టైమ్‌లో తాను చేసిన మెరుపు గోల్‌పై స్పందిస్తూ.. ఈ ప్రపంచకప్‌ను స్పెయిన్ గెలవాలని 'విధి' ముందే రాసిపెట్టి ఉందని వ్యాఖ్యానించాడు.

**మెస్సీ అంటే భయం ఉంటుంది!**

మ్యాచ్ 62వ నిమిషంలో మైఖేల్ ఓయర్జబల్ స్థానంలో సబ్‌స్టిట్యూట్‌గా మైదానంలోకి వచ్చిన టోర్రెస్.. 106వ నిమిషంలో నికో విలియమ్స్ అందించిన బంతిని గోల్‌గా మలిచి స్పెయిన్‌కు రెండో ప్రపంచకప్ టైటిల్‌ను అందించాడు. మ్యాచ్ అనంతరం బార్సిలోనా ఫార్వర్డ్ అయిన టోర్రెస్ మాట్లాడుతూ.. "ఫైనల్ మ్యాచ్‌లు ఎప్పుడూ కఠినంగానే ఉంటాయి. ముఖ్యంగా ప్రత్యర్థి జట్టులో లియోనెల్ మెస్సీ లాంటి ఆటగాడు ఉన్నప్పుడు కచ్చితంగా ఆందోళన ఉంటుంది. కానీ మా ఆటపై మాకు ఎప్పుడూ నమ్మకం ఉంది. మా సొంత ఫుట్‌బాల్‌ను ప్రపంచానికి చూపించాలనుకున్నాం, అదే చేసి చూపించాం" అని గర్వంగా చెప్పాడు.

**ఆ ఒక్క గోల్‌తోనే విమర్శలకు సమాధానం**



ఈ టోర్నీలో ఆదివారం నాటి మ్యాచ్‌కు ముందు వరకు టోర్రెస్ ఒక్క గోల్ కూడా చేయలేదు. దీనివల్ల అతడిపై విమర్శలు వచ్చాయి. వాటన్నింటికీ ఈ మ్యాచ్ విన్నింగ్ గోల్‌తో సమాధానం చెప్పినట్లయిందని టోర్రెస్ అన్నాడు. "ఆ సమయంలో గోల్ కొట్టడం నాకెంతో ఉపశమనాన్ని ఇచ్చింది. టోర్నీ అంతటా నాపై ఎన్నో విమర్శలు వచ్చాయి. కానీ నేను ముందే చెప్పినట్లు, విధి మా వైపు ఉంది. ఈ గోల్ కేవలం నా ఒక్కడిది కాదు, మా దేశంలోని 4.7 కోట్ల మంది స్పానిష్ ప్రజల కల. దేశానికి దూరంగా ఇక్కడ ఆడుతున్నా.. ప్రజల ఆశీస్సులు మాకు ఎప్పుడూ తోడుంటాయి" అని భావోద్వేగానికి లోనయ్యాడు. 2010 తర్వాత స్పెయిన్ మళ్లీ ఫుట్‌బాల్ సామ్రాజ్యాన్ని శాసించడంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్పానిష్ అభిమానులు పండగ చేసుకుంటున్నారు.



72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన తర్వాత దేశవ్యాప్తంగా ఉన్నవారి దృష్టంతా ఆర్టికల్-370పై పడింది. రిలీజ్ టైమ్‌లో చర్చనీయాంశంగా మారిన ఈ సినిమా ఇప్పుడు జాతీయ స్థాయిలోనూ అత్యున్నత గుర్తింపు దక్కించుకుంది. ఈ చిత్రానికి ఒకేసారి రెండు ప్రతిష్టాత్మక జాతీయ అవార్డులను సొంతం చేసుకోవడం విశేషం. ఉత్తమ చలనచిత్ర అవార్డుతో పాటు.. ఇందులో అద్భుతమైన నటను కనబరిచిన యామీ గౌతమ్‌కు ఉత్తమ నటిగా అవార్డు లభించింది. తాజాగా, ఈ విషయంపై యామీ గౌతమ్ సోషల్ మీడియా ద్వారా తెలుపుతూ.. ఎమోషనల్ అయ్యారు. ఈ అవార్డు తన 14 ఏళ్ల సినీ ప్రయాణానికి, పట్టుదలకు, సినిమాపై తనకున్న నమ్మకానికి దక్కిన గౌరవమని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి లైఫ్ జర్నీలో తాము ఎందుకు వెనకడుగు వేయలేదు అని గుర్తుచేసే ఒక అద్భుతమైన క్షణం వస్తుందని, తన జీవితంలో ఈరోజు అలాంటి క్షణమేనని ఆనందం వ్యక్తం చేశారు. 'ఆర్టికల్ 370' సినిమాకు జాతీయ అవార్డు అందుకోవడం తన జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేని ఒక గొప్ప గౌరవమని చెప్పారు. 37 ఏళ్ల యామీ గౌతమ్ తన సినీ కెరీర్ గురించి మాట్లాడుతూ.. తాను ఎప్పుడూ అవార్డుల కోసం పని చేయలేదని, కేవలం పనిపై శ్రద్ధ పెట్టానని తెలిపారు.

## నా కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కింది..

## పగ్లైట్' దర్శకుడి చిత్రంలో జాన్వీ?

వైవిధ్యమైన పాత్రల్లో నటిస్తూ కుర్రకారుని ఆకట్టుకునేలా తెరపై సందడి చేస్తోంది బాలీవుడ్ అందాల తార జాన్వీ కపూర్. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఆమె ఖాతాలోకి మరో ప్రాజెక్టు చేరినట్లు తెలుస్తోంది. 'పగ్లైట్' ఫేమ్ దర్శకుడు ఉమేశ్ బిస్ట్ రూపొందించనున్న ఓ చిత్రంలో జాన్వీ నటించనున్నట్లు సమాచారం. ఈ సినిమాని ఏక్తా కపూర్, వినీత్ జైన్ సంయుక్తంగా నిర్మించనున్నారట. ఈ ప్రాజెక్టు ఈ ఏడాది అక్టోబరు, నవంబరు నెలల్లో సెట్స్‌పైకి వెళ్లనున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో ఉమేశ్ బిస్ట్ దర్శకత్వంలో రూపొందిన 'ది ట్రయల్', 'గ్యారా గ్యారా' అనే సిరీస్‌లు ప్రేక్షకుల్ని అలరించాయి. ప్రస్తుతం జాన్వీ 'లగ్ జా గలే' అనే రొమాంటిక్ రివెంజ్ డ్రామాలో నటిస్తోంది. ఇటీవలే 'పెద్ది' చిత్రంలో అచ్చియమ్మ పాత్రతో సినీప్రియుల్ని ఆకట్టుకున్న జాన్వీ ఉమేశ్ దర్శకత్వంలో ఎలా కనిపించనుందో తెలుసుకోవాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి.



## కొత్త లుక్ సన్నాహాలు



కథ, పాత్రలు అంతగా డిమాండ్ చేయకపోయినా సరే... కథానాయకులు ఇదివరకు సినిమాకీ సినిమాకీ తమ లుక్‌ని మార్చుకునేవారు. తాము కనిపించే విధానంలోనైనా కొత్తదనం చూపించాలన్నదే ఆ ప్రయత్నం. కానీ ఈమధ్య దర్శకులు సిద్ధం చేస్తున్న కథ, పాత్రలే కొత్త లుక్‌ని డిమాండ్ చేస్తున్నాయి. దాంతో ప్రతి సినిమాకీ తారలు లుక్‌ని మార్చుకోవల్సి వస్తోంది. 'పెద్ది' సినిమా కోసం అదే తరహాలో తనని తాను మార్చుకుని తెరపై కనిపించిన రామ్‌చరణ్... మళ్లీ లుక్‌ని మార్చనున్నారు. తదుపరి ఆయన సుకుమార్ దర్శకత్వంలో సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. అది కూడా పీరియాడిక్ కథతో, ఓ ప్రత్యేకమైన ప్రపంచాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలుస్తోంది. ఆ పాత్ర కోసం 'పెద్ది'కి పూర్తి భిన్నంగా రామ్‌చరణ్ సిద్ధం కావల్సి ఉంటుందని, త్వరలోనే దానిపైన దృష్టి పెట్టనున్నారని, అందుకు కొన్ని నెలల సమయం పట్టనున్నట్లు తెలిసింది. ఈ సినిమా స్క్రిప్ట్ పనులు సెప్టెంబరు నాటికి తుదిదశకు చేరుకుంటున్నాయని, అక్టోబరులో చిత్రీకరణ ప్రారంభమయ్యే అవకాశాలున్నట్లు సమాచారం.




## 'రౌడీ జనార్ధన' ఆ రెండు సన్నివేశాలకు స్క్రీన్ చిరిగిపోవాల్సిందే

విజయ్ దేవరకొండ ప్రస్తుతం 'రౌడీ జనార్ధన' అనే పవర్‌ఫుల్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో హీరోగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో కీర్తి సురేష్ హీరోయిన్‌గా కనిపించనుండగా, రవి కిరణ్ కోలా దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. క్రిస్టో జేవియర్, విశాల్ మిశ్రా సంగీతం అందిస్తున్న ఈ సినిమాను ఈ ఏడాది డిసెంబర్‌లో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇక తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దాని ప్రకారం, ఈ సినిమాలోని ప్రీ-క్లైమాక్స్, క్లైమాక్స్ ఎపిసోడ్లు ప్రేక్షకులను ఉర్రూతలూగించే స్థాయిలో ఉండబోతున్నాయట. ముఖ్యంగా అప్పటివరకు సాగిన సినిమా ప్రభావం మొత్తం ప్రీ-క్లైమాక్స్ నుంచి మరో స్థాయికి చేరుకుని, క్లైమాక్స్ వరకు పీక్ లెవల్‌లో కొనసాగుతుందని టాక్ వినిపిస్తోంది. అదే నిజమైతే ఈ సినిమా సూపర్ సాలిడ్ విజయాన్ని అందుకోవడం ఖాయమని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మరి ఈ చిత్రంతో విజయ్ దేవరకొండ ఎలాంటి విజయాన్ని సొంతం చేసుకుంటాడో చూడాలి.



ఇటీవల 'డెకాయిట్' చిత్రంతో ప్రేక్షకులను అలరించిన మృణాల్ ఇప్పుడు ఓ సస్పెన్స్ థ్రిల్లర్‌తో అభిమానులకు సరికొత్త అనుభూతిని ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. మృణాల్ ఠాకూర్, హుమా ఖురేషి ప్రధాన పాత్రల్లో నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ 'పూజా మేరీ జాన్' ఎట్టకేలకు విడుదలకు సిద్ధమైంది. దాదాపు నాలుగేళ్లుగా వాయిదా పడుతూ వస్తున్న ఈ సినిమా డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 సొంతం చేసుకుంది. తమ రాబోయే కొత్త కంటెంట్ లిస్ట్‌లో ఈ సినిమాను అధికారికంగా చేర్చినట్లు జీ5 ప్రకటించింది. అయితే, దీని స్ట్రీమింగ్ డేట్‌ను మాత్రం సస్పెన్స్‌లో ఉంచారు. నిజానికి, ఈ సినిమాను మొదట 'జియో సినిమా'లో డైరెక్ట్ ఓటీటీ రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. కానీ, జియో సినిమా డిస్నీ+హాట్‌స్టార్ విలీనం తర్వాత ఈ సినిమా విడుదల ప్లాన్స్ అన్నీ నిలిచిపోయాయి. 2022 చివరకే షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తయినప్పటికీ.. నాలుగేళ్ల పాటు విడుదలకు నోచుకోని ఈ మూవీ విడుదల కాబోతుంది. నవజ్యోత్ గులాటి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మూవీని దినేష్ విజన్ మ్యాడాక్ ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మించగా.. ఇందులో విక్రమ్ సింగ్ చౌహాన్, విజయ్ రాజ్ కీలక పాత్రలు నటించారు. ఈ సినిమా కథ విషయానికొస్తే.. పూజా అనే ఒక సాదాసీదా అమ్మాయి చుట్టూ తిరుగుతుందని టాక్. ఈమె జీవితంలోకి ఒక అపరిచిత వ్యక్తి ప్రవేశిస్తాడు. అతను పూజాను పిచ్చిగా ప్రేమిస్తూ, ఆమె ప్రతి కదలికను గమనిస్తూ ఉంటాడు. డిజిటల్ యుగంలో ఒక అమ్మాయిని ఎలా ట్రాక్ చేయవచ్చో, సోషల్ మీడియా ద్వారా ఆమె వ్యక్తిగత జీవితంలోకి ఎలా చొరబడవచ్చో ఈ సినిమాలో చూపించబోతున్నారట. పూజాను ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, ఇంటర్నెట్ ద్వారా తీవ్రంగా భయభ్రాంతులకు గురిచేస్తూ ఉంటాడని తెలుస్తోంది. ఈ డిజిటల్ వేధింపుల వల్ల పూజా జీవితం ఎలా నరకంగా మారింది? ఆ అజ్ఞాత వ్యక్తి నుండి తనను తాను కాపాడుకోవడానికి ఆమె ఎలాంటి పోరాటం చేసింది? అనేదే అసలు కథ.

## డైరెక్ట్ ఓటీటీలోకి రాబోతున్న మృణాల్ ఠాకూర్ సస్పెన్స్ థ్రిల్లర్



## 'అబ్సెషన్'తో 'కె - ర్యాంప్' పోలిక.. ట్రోల్స్‌పై కిరణ్ అబ్బవరం వివరణ

తన చిత్రం 'కేర్యాంప్', హాలీవుడ్ మూవీ 'అబ్సెషన్' కథలు ఒకేలా ఉంటాయని కామెంట్ చేసి నెటిజన్ల ట్రోలింగ్‌కు గురయ్యారు హీరో కిరణ్ అబ్బవరం (Kiran Abbavaram). అయితే, తన మాటలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారని, ఆ హాలీవుడ్ చిత్రాన్ని కించపరిచే ఉద్దేశం తనకు లేదంటూ తాజాగా ఆయన వివరణ ఇచ్చారు. తన తదుపరి చిత్రం 'చెన్నై లవ్ స్టోరీ' (Chennai Love Story) ప్రమోషన్లలో భాగంగా ఈ వివాదంపై ఆయన స్పందించారు.

"నా మాటలను ఎందుకు నెగెటివ్‌గా తీసుకుంటున్నారో అర్థం కావడంలేదు. ఈ మధ్య నా స్నేహితులు ఫోన్ చేసి 'అబ్సెషన్' సినిమా చూశావా? అని అడిగారు. షూటింగ్‌లో బిజీగా ఉండి చూడలేదని చెప్పా. ఆ సినిమాలో కూడా 'కేర్యాంప్' తరహాలోనే ఒక అమ్మాయి.. అబ్బాయి వెంటపడుతుందని చెప్పారు. దానికి నేను 'అయితే మన సినిమా, వాళ్లలా రూ.1500 కోట్లు సాధించలేకపోయింది' అని నవ్వుతూ బదులిచ్చా. అంతేగాని నేను ఆ రెండింటినీ పోల్చలేదు. ఈ వ్యాఖ్యలను కొందరు నెటిజన్లు తీవ్రంగా పరిగణించి, నన్ను ట్రోల్ చేయడం మొదలుపెట్టారు. నా సినిమా కంటే కూడా ఇతర చిత్రాలను నేను ఎక్కువగా గౌరవిస్తాను. 'అబ్సెషన్'.. 'కె ర్యాంప్' కంటే చాలా పెద్ద హిట్ సినిమా. ప్రపంచవ్యాప్తంగా దానికి మంచి గుర్తింపు ఉంది. ఆ చిత్రాన్ని నేను ఏమాత్రం కించపరచలేదు. నేను అన్న మాటలను పూర్తిగా చూస్తే అసలు విషయం అర్థమవుతుంది" అని కిరణ్ స్పష్టం చేశారు. ఇక, కర్రీ బార్కర్ దర్శకత్వంలో వచ్చిన 'అబ్సెషన్' (Obsession) ప్రపంచవ్యాప్తంగా ఘన విజయం సాధించింది. తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీగా వసూళ్లు సాధించింది. అలాగే, కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా, జైన్స్ నాని దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'కెర్యాంప్' (KRamp). ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 27.50 కోట్లు రాబట్టింది. ప్రస్తుతం కిరణ్ అబ్బవరం రవి నంబూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'చెన్నై లవ్ స్టోరీ'లో నటిస్తున్నారు. గౌరీ ప్రియ హీరోయిన్‌గా మెరవనున్నారు. ఈ మూవీ జులై 24న థియేటర్లలో విడుదల కానుంది.

## మోహన్ బాబుకి అసలైన టైం స్టార్ట్ అయింది..

కలెక్షన్ కింగ్ మోహన్ బాబు గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. హీరోగా ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించి తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. అయితే, ఆ తర్వాత హీరోగా చేసిన పలు చిత్రాలు ఆశించిన విజయాలను అందుకోకపోవడంతో ఆయన క్రేజ్ క్రమంగా తగ్గింది. మధ్యలో యమదొంగ, బుజ్జిగాడు వంటి చిత్రాల్లో కీలక పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించారు. అనంతరం కొన్ని సినిమాల్లో నటించినప్పటికీ అవి పెద్దగా ప్రేక్షకాదరణ పొందలేదు.

ప్రస్తుతం మోహన్ బాబు మళ్లీ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. తాజాగా జయకృష్ణ ఘట్టమనేని హీరోగా, అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కిన శ్రీనివాస మంగాపురం చిత్రంలో ఆయన ప్రతినాయకుడి పాత్రలో నటించారు. ఈ చిత్రం జూలై 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాల్లో మోహన్ బాబు లుక్, పాత్రకు మంచి స్పందన లభించింది. సినిమా విజయవంతమై, ఆయన పాత్ర ఆకట్టుకుంటే కెరీర్‌కు ఇది కీలక మలుపుగా మారే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇక ప్రస్తుతం నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న ది ప్యారడైజ్ చిత్రంలో కూడా మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం కూడా విజయాన్ని సాధించి, మోహన్ బాబు పాత్రకు మంచి గుర్తింపు దక్కితే ఆయనకు మరోసారి వరుస అవకాశాలు వచ్చే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. మరి ఈ రెండు సినిమాలతో మోహన్ బాబు ఏ స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకుంటారో చూడాలి.



Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com